

# పోలవరం ప్రాజెక్టు : ఆదివాసుల విషాదం



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

"పోలవరం ప్రాజెక్టు కడితే అంతరించేది ఒక భౌగోళిక ప్రాంతమే కాదు. అత్యున్నతమైన గిరిజన సంస్కృతి, అతి సున్నితమైన జీవ వైవిధ్యం"

- రచయిత

"తరతరాలుగా అభివృద్ధి చెందిన గిరిజన జీవన విధానాన్ని అభివృద్ధి ప్రాజెక్టులు పేరుతో ఛిన్నాభిన్నం చేయటం న్యాయమేనా అనే విషయం తీవ్రంగా ఆలోచించాలి" : భూరియా కమిషన్ ఛైర్మన్ శ్రీ దిలీప్‌సింగ్ భూరియా రాష్ట్రపతికి నివేదిక సమర్పిస్తూ రాసిన లేఖలో పేర్కొన్న ఒక అంశం.

# పోలవరం ప్రాజెక్టు : ఆదివాసుల విషాదం

"**పో**లవరం నీటిపారుదల ప్రాజెక్టు కడితే రెండువందల యాభైకి పైగా గిరిజన గ్రామాలు మునిగిపోతాయి. వాళ్ళు ఎక్కడకిపోవాలి?" (ది. 03-06-1990లో 'ఆదివారం ఆంధ్రప్రభ'లో నేను రాసిన వ్యాసంలో వేసిన ప్రశ్న).

"పోలవరం ప్రాజెక్టు క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 276 గ్రామాలు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో 4 గ్రామాలు, ఒడిషా రాష్ట్రంలో 8 గ్రామాలు మునుగుతాయి. (ది. ఆగస్టు 13, 2014న పార్లమెంట్‌లో కేంద్ర పర్యావరణ శాఖామాత్యులు శ్రీ ప్రకాష్ జవదేకర్ ఇచ్చిన వివరాలు).

"పోలవరం ప్రాజెక్టు క్రింద 1,88,370 మంది నిరాశ్రయులు అవుతారు." (ది. 07-05-2015న కేంద్ర జల వనరుల మంత్రి పార్లమెంట్‌లో ఇచ్చిన వివరాలు).

**"పోలవరం ఫ్రాడ్" : రిచర్డు మహాపాత్ర, 'డౌన్ టు ఎర్త్', మే 15, 2011**

"పోల'వరం' కాదు శాపం" ఇంజనీర్ దేవరుప్పల భీమయ్య 2012లో రాసిన పుస్తకానికి టైటిల్.

"ఆదివాసుల దౌర్భాగ్యం" కె. బాలగోపాల్ ఆదివాసి గొంతుక, సంపుటి 1, సంచిక 3, ఏప్రిల్ - డిసెంబర్, 2013లో ప్రచురితమైన వ్యాసానికి టైటిల్.

అక్షర ప్రతిఘటన : "పోలవరం వ్యతిరేక సాహిత్య స్పందన" పోలవరం గిరిజన పరిరక్షణ వేదిక, హైదరాబాద్-2014.

"వీలైనంత వరకు షెడ్యూలు ప్రాంతాలలో భూసేకరణ వద్దు" (భూసేకరణ, పునరావాస చట్టం, 2013 పేరా 41)

పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజా యుద్ధం మొదటిసారిగా ప్రకటించింది సి.పి.ఎం. పార్టీయే. ఇప్పటికీ గిరిజన సంఘం, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో తీవ్ర పోరాటాలు కొనసాగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు వల్ల జరిగే విధ్వంసం గురించి వచ్చిన వ్యాసాలను

క్రోడీకరించడమే గాక నా అనుభవాల్ని కూడా పంచడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**మునిగేది ఒక భౌగోళిక ప్రాంతమైనా,**

**కనుమరుగయేది గిరిజన సంస్కృతి, అరుదైన జీవవైవిధ్యం**

పోలవరం ప్రాజెక్టు ఎన్నో దశాబ్దాలుగా ప్రతిపాదన స్థాయిలోనే వుంది. 2005 నుంచి కొంత కదలిక మొదలైంది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగినప్పుడు పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా మంజూరు చేయడం అనే అంశం ముఖ్యమైనది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి అమలుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం కొంత దుడుకుగా వ్యవహరించింది కూడా. తెలంగాణలో భాగంగా వున్న 7 మండలాలలోని ముంపు గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు ఒక ఆర్డినెన్సు ద్వారా బదలాయించడం జరిగింది. ఇవి కూనవరం, వి.ఆర్. పురం, చింతూరు, భద్రాచలం (భద్రాచలం పంచాయతీ తప్పించి), కుకునూరు, వేలేరుపాడు, బూర్గంపాడు (12 గ్రామాలు తప్పించి), దీనితో ఒక రోజు బంద్ తెలంగాణలో జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఏర్పడే లోపలే ఈ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం జరిగింది. కొన్ని రోజుల పాటు యీ చర్యను అప్రజాస్వామిక చర్యగా వర్ణించినా, ఇది 'ముగిసిన అధ్యాయం'గా తెలంగాణ ముఖ్యమంత్రి వర్ణించడంతో దీనిపై చర్చ ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా కొనసాగుతోంది. రాజకీయం ఏది ఏమైనా గిరిజన సమస్యను రాజ్యాంగ / చట్టపరంగా ఆలోచించవలసిన పరిస్థితి ఉంది. ఇది తెలంగాణ, ఆంధ్ర సరిహద్దుల సవరణ సమస్యగా కాక గిరిజన వ్యవస్థ అరుదైన పర్యావరణం జీవన్మరణ సమస్యగా ఆలోచించాలి. బలిపీఠం మారిందంతే. ఉరితీసే తలారులు మారతారు అంతే. అసలు బలికాకుండా చర్యలు లేవా? అని కూడా ఆలోచించాలి. గిరిజనుల రాజ్యాంగ, చట్టపరమైన హక్కులు, వాటి ఉల్లంఘన రాజ్యమే చేస్తే ఏం చెయ్యాలి ? అనేది అన్నిటికంటే పెద్ద ప్రశ్న. రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులను ప్రజలు కాపాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం 'ఈ వ్యాసం లక్ష్యం'. అందుకే వివిధ ప్రచురణల్లోని అంశాలను పొందుపరిచే ప్రయత్నం జరిగింది ఇందులో. ఎందుకంటే ముంపు జరిగేది ఒక భౌగోళిక ప్రాంతమే కాదు. తరతరాలుగా వస్తున్న మహోన్నత సంస్కృతిని కాపాడుకుంటూ వస్తున్న గిరిజనుల జీవనమే ప్రశ్నార్థకం కాబోతుంది. రాష్ట్రమే రాజ్యాంగ ఉల్లంఘనలకు శ్రీకారం చుడుతోందనిపిస్తోంది. తూర్పు కనుమల్లో ప్రత్యేకత సంతరించుకున్న జీవ వైవిధ్యం మునిగిపోయి అంతరించుకుపోతుంది. పశు, పక్ష్యాదులు, జలచరాలు, చెట్లు, చేమలు, వనమూలికలు అన్నీ

ముంపుకు గురవుతాయి.

**ముంపు గ్రామాలు**

దిె. ఆగస్టు 13, 2014న పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర పర్యావరణ శాఖామాత్యులు శ్రీ ప్రకాష్ జవదేకర్ ఇచ్చిన వివరాలు ఇలాగ ఉన్నాయి.

(ఆధారం : టైమ్స్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్), ఆగస్టు 14, 2014).

"పోలవరం ప్రాజెక్టు క్రింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 276 గ్రామాలు, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రంలో 4 గ్రామాలు, ఒడిస్సా రాష్ట్రంలో 8 గ్రామాలు (మొత్తం 288 గ్రామాలు) మునుగుతాయి. ఇంతేకాకుండా 3427.52 హెక్టార్ల అటవీ భూమి కూడా మునుగుతుందని అంచనా. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 1994 ప్రకారం పోలవరం ప్రాజెక్టు పర్యావరణ ప్రభావం అంచనా వేయటం జరిగింది. ముంపుకు గురయ్యే జీవ వైవిధ్యం, జలచరాలు, మానవులపై ప్రభావాన్ని అంచనా వేసి పర్యావరణ మేనేజ్‌మెంట్ ప్రణాళికను కూడా తయారు చేయటం జరిగింది. దాని ప్రకారం నష్టపరిహార చర్యలు చేపట్టడం జరుగుతుంది.

పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్‌కు 25-06-2014లో ఇచ్చిన సవరణ ప్రకారం రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ అంచనా అధారిటీకి మరిన్ని అధికారాలు బదిలీ చేయటం జరిగింది. దీనివల్ల పర్యావరణ సంబంధిత అనుమతులు త్వరితగతంగా ఇవ్వడానికి వీలు అవుతుంది. విధి విధానాలను కూడా సరళీకరించడానికి కూడా వీలుపడుతుంది."

పైన చెప్పిన దాంట్లో ముంపును గురించి, ముంపునకు గురయ్యే ఆదివాసీల పునరావాసం గురించి ప్రస్తావన లేదు. సభ్యులు అడిగిన ప్రశ్న తమ పరిధిలోకి రాదని సాంకేతిక సమాధానం చెప్పవచ్చు. అలాగే పోలవరం ప్రాజెక్టు 4 సంవత్సరాలలో పూర్తి అవుతుందని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుగారు, గౌ॥ కేంద్ర మంత్రి శ్రీ వెంకయ్య నాయుడుగారు పలు సందర్భాలలో పేర్కొనడం జరిగింది. కాని వీరు కూడా ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల భవిష్యత్తు గురించి అంత గట్టిగా ప్రస్తావించకపోవడం ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఎందుకంటే పునరావాసం అనేది సుదీర్ఘ ప్రణాళిక. వేరేచోటకు తీసుకువెళ్ళి వదిలేస్తే సరిపోదు. ఎప్పుడో నాగార్జునసాగర్, శ్రీశైలం క్రింద కల్పించిన పునరావాస కేంద్రాలు (ఇప్పుడు గ్రామాలు) ఇప్పటికీ స్థిరపడలేదు. లక్షా 90వేల సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. మధ్యతరహా నీటి ప్రాజెక్టులు క్రింద ముంపుకు గురైన వారి సంగతి సరేసరి. పోలవరం క్రిందే ఇప్పటికిప్పుడు నిర్వాసితులు అయ్యేవారికిచ్చే పరిహారం మీద ఎన్నో తగవులు చూస్తూనే ఉన్నాం.

**ప్రాజెక్టు వివరాలు**

శ్రీ దేవరుప్పల భీమయ్యగారు "పోల 'వరం' కాదు శాపం" (People against Polavaram Project, Bhadrachalam, 2012) అనే పుస్తకంలో ప్రాజెక్టు సాంకేతిక వివరాలు ఇచ్చారు. దాంతో పాటు ప్రాజెక్టు చరిత్ర కూడా వివరంగా ఇచ్చారు. రచయిత పరిచయం ప్రకారం వారు కేంద్ర డిజైన్ సంస్థలో కూడా పనిచేసినవారు కాబట్టి వారిచ్చిన వివరాలను నమ్మకంగా తీసుకోవచ్చును. వివరాలు ఇలాగ ఉన్నాయి.

---

| | | |
|---|---|---|
| 1. డ్యాం నిర్మించే స్థలం | : | రామయ్య పేట గ్రామం, పోలవరం మండలం |
| 2. డ్యాం వరకు పరివాహక విస్తీర్ణం | : | 3,06,643 చ.కి.మీ. |
| 3. పోలవరం దగ్గర రికార్డు అయిన గరిష్ట వరద ప్రభావం (1986) | : | 30.81 లక్షల క్యూసెక్కులు |
| 4. సంవత్సరపు వర్షపాతం | : | 1022.95 మి.మీ. |
| 5. పవర్‌హౌజ్ | : | 12 యూనిట్లు, ఒక్కొక్కటి 80 మె.వాట్లు. |
| 6. గరిష్ట జలాశయ మట్టం | : | + 45.72 మీ. (150 అడుగులు) |
| 7. కనిష్ట జలాశయ మట్టం | : | + 41.15 మీ. (135 అడుగులు) |
| 8. పూర్వ జలాశయ నీటి నిల్వ పరిమాణం | : | 194 శతకోటి ఘనపుటడుగులు |
| 9. నిరుపయోగ నీటి నిల్వ పరిమాణం | : | 118.8 శతకోటి ఘనపుటడుగులు |

---

(మిగిలిన సాంకేతిక వివరాలకు వీరి పుస్తకం చదవండి)

భీమయ్యగారి రచనలో స్పష్టత, ఆతృత కూడా వుంది. 1941లో తయారుచేసిన ప్రతిపాదనల్లో జలాశయం మట్టం + 150 అడుగులు. తరువాత 1942లో + 170 అడుగులకు కొత్త ప్రతిపాదనలు చేసారు. 1946లో చేసిన ప్రతిపాదనల ప్రకారం జలాశయం మట్టం +190 అడుగులు. తరువాత +205కు పెంచి భద్రాచలం రాముని పాదాలకు తాకే విధంగా నిర్మాణం తలపెట్టి దానికి 'రామపాద సాగర్' అని నామకరణం చేసారు. ఆ రోజుల్లో యీ ప్రాజెక్టు చేపట్టక పోవటానికి రెండు కారణాలు (1) ఒకటి గట్టి పునాదులకు కావలసిన రాతిపొరలు చాలా లోతు వరకు లేకపోవడం (2) అధిక వ్యయం (అప్పుడే రూ. 129 కోట్లు.

(1947-48 రేట్ల ప్రకారం). ముంపు గ్రామాలు 366గా గుర్తించారు.

1965లో ప్రాజెక్టు పునః పరిశీలన జరిగినప్పుడు శ్రీ ఎ.సి. మిత్రా కమిటీ పోలవరం డ్యాం నిర్మాణం సాధ్యం కాని పని అని చెప్పారు. తరువాత జల వివాదాల (బచావత్) ట్రిబ్యునల్ (1969), పర్యావరణ చట్టం 1986 రావడంతో ప్రాజెక్టు అనుమతులు ఆలస్యం అయ్యాయి. ఇప్పటికీ చాలామంది అధికారులలో ఒక అభిప్రాయం వుంది. ఇన్ని దశాబ్దాల నుంచి కాని పని ఇప్పుడు అవుతుందా? అని. నిర్లిప్తత కంటే ముంపు వస్తే ఏమవుతుందనే విషయం చర్చించడం అవసరం. మునిగిపోయిన తరువాత చేసేది ఏమీ లేదు.

భీమయ్యగారు మరో విషయం కూడా ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల భూకంపాలు రావచ్చు అని. నిరుపయోగ నీటి నిల్వ ఎక్కువగా ఉండటం వల్ల డ్యాం పగిలిపోయే ప్రమాదం కూడా ఉంది. అదేకాకుండా బలమైన పునాది లేదు. ఇంతా చేసి యీ ప్రాజెక్టు వల్ల అదనపు ఆయకట్టు వస్తుందా అంటే అదీ లేదు అంటారు భీమయ్యగారు. వివరాల్లోకి వెళ్తే...

ఈ ప్రాజెక్టు మంజూరు ఆలస్యం అవడంతో ఏలేరు (1 లక్ష ఎకరాలు), పుష్కర (1.86 లక్షల ఎకరాలు), తాటిపూడి (1.36 లక్షల ఎకరాలు), మరెన్నో నీటి పారుదల ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయి సాగునీరు అందిస్తున్నాయి. పోలవరం క్రింద ప్రతిపాదిత ఆయకట్టు 7.21 లక్షల ఎకరాలు ఉంటే, 8.75 లక్షల ఎకరాలు ఈ ప్రాజెక్టు క్రింద ఉభయ గోదావరిజిల్లాలు, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలో సాగులో ఇప్పటికే ఉంది. ఈ లోపల పట్టిసీమ ఎత్తిపోతల పథకం తెరమీదకి వచ్చింది. అంటే వేల కోట్ల అంచనా కల యీ ప్రాజెక్టు వల్ల అదనపు ఆయకట్టు రాదు. కాంట్రాక్టర్ల పంట మాత్రం పుష్కలంగా పండుతుంది. ప్రాజెక్టు ఎగువభాగంలో ముంపుతో ఆదివాసి జీవనం అస్తవ్యస్తం, దిగువ ప్రాంతంలో డ్యాం బద్దలవుతుందేమో, భూకంపాలు వస్తాయేమోనని క్షణం క్షణం భయం మాత్రం ఖాయం అని ఆయన రిపోర్టు సారాంశం.

**గిరిజన వ్యవస్థ**

ప్రాజెక్టు ముంపు ప్రాంతం ఇంచుమించుగా అంతా షెడ్యూలు గిరిజన ప్రాంతమే. గిరిజనేతర జనాభాలో ఎక్కువ శాతం వలసదారులే. వారు గిరిజన ప్రాంతాలలోని భూములను చట్ట వ్యతిరేకంగా ఆక్రమించుకున్నవారే. తెలివైనవాళ్ళు, రాజకీయ అండదండలున్నాయి. ముంపువల్ల నష్టపోయేది నిజంగా గిరిజనులే. అందువల్ల ఇప్పుడు గిరిజన సంస్కృతికి రాబోయే ఉపద్రవం గురించి చర్చిద్దాం. ముంపుకు గురయ్యే ప్రాంతంలో నివసించే గిరిజనుల్లో కోయ, కొండ రెడ్లు ముఖ్యమైనవారు. వారి జీవన విధానం ఎలాగుందో తెలుసుకుందాం.

2005లో నేను గిరిజన సంస్కృతి పరిశోధన, శిక్షణ సంస్థ సంచాలకులుగా పనిచేసిన కాలంలో నేను ప్రచురించిన "ఆంధ్రప్రదేశ్ గిరిజన సంస్కృతి, పరివర్తన", గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్‌లో కోయలు, కొండ రెడ్లు గురించి వివరాలు పేర్కొన్నాను. వాటిలో నుంచి ఈ వ్యాసానికి అవసరమైన వివరాలు ఇప్పుడు మీ ముందు ఉంచుతాను. గిరిజన సంస్కృతి చాలా పురాతనమైనది. మహోన్నతమైనది. గిరిజన సంస్కృతి అంటే సామాన్యంగా మనకు జ్ఞాపకం వచ్చేది – వేషధారణ, ఆటలు, పాటలు లాంటివి. మొత్తం జీవన విధానం – ఆర్థిక, సామాజిక, రాజకీయ, చారిత్రక విషయాలన్నీ కలిస్తేనే సంస్కృతి అని పిలుస్తారు.

గిరిజన ప్రాంతాలన్నీ ఈ మధ్య వరకు బయటి ప్రాంతాలతో సంబంధాలు లేకుండా ఉండేవి. అప్పుడప్పుడు వచ్చిపోయే సంచార వ్యాపారులు, వారం వారం సంతలో కలిసే మధ్యవర్తి వ్యాపారులతో గిరిజనులకు చాలాకాలం నుండి సంబంధాలు ఉండేవి. బ్రిటిష్ ప్రభుత్వం తమ అధికారాన్ని / అధికారుల్ని ఈ ప్రాంతాలలోకి పంపేవరకు ప్రభుత్వంతో ప్రత్యేక పరిచయాలు లేవు. అవి కూడా చేదు అనుభవాలతో నిండినవే. తామొక్కరే అడవిలో నివసిస్తున్నప్పుడు గిరిజనులు తమదైన జీవనశైలిని పెంపొందించుకున్నారు. ప్రతి గ్రామం / ఆవాసానికి ఒక సరిహద్దు ఉంటుంది. ఆ సరిహద్దు లేక శివారు లోపల ఉండే సహజ వనరులు నీరు, భూమి, అడవిలాంటివి ఆ గ్రామం / ఆవాసానికి చెందినవి (సామాజిక ఆస్తి)గా భావించేవారు. సమాజంలోని అందరూ సమాన అవకాశాలతో జీవనం గడిపే ఆర్థిక, సామాజిక ఆర్థిక వ్యవస్థను తయారు చేసుకున్నారు. భూమి, అడవి సామాజిక ఆస్తి. వ్యక్తులకు అనుభవించే హక్కు మాత్రమే వుండేది. తరువాత వ్యవసాయ భూమిపై వ్యక్తిగత ఆస్తి వ్యవస్థ వచ్చింది. పోడు వ్యవసాయంకు వీలుగా ఉండే కొండవాలు కూడా సామాజిక ఆస్తి. దాని మీద కూడా అనుభవించే హక్కు మాత్రమే ఉండేది. ఇప్పటికీ అడవిలో దొరికే చిన్న తరహా అటవీ ఫలసాయం ఇచ్చే చెట్లు సామాజిక ఆస్తే. అయితే వ్యాపార అవకాశాలు ఎక్కువయ్యే ఫలసాయాలు : బంక / జిగురు లాంటి వాటిలో వ్యక్తిగత ఆస్తి ధోరణులు వస్తున్నాయి. పెద్ద జంతువులను వేటాడగా వచ్చిన మాంసం అందరూ పంచుకుంటారు.

సమాజ ఆస్తి నిర్వాహణకు 'కుల పంచాయతీ' అనే రాజకీయ వ్యవస్థను కూడా నిర్మించుకున్నారు. గ్రామంలో కుల పంచాయతీ ఉంటుంది. కుల పెద్ద, ఇతర పెద్దలతో కూడిన ఈ పంచాయతీ గిరిజన సమాజాన్ని నడిపిస్తుంది. దీనికి సామాజిక న్యాయ వ్యవస్థ ఉంటుంది. తరతరాలుగా న్యాయసూత్రాలు (నీతి సూత్రాలు) కూడా తయారు చేసుకున్నారు. ఈ పంచాయతీ వ్యవస్థ ఇప్పటికీ సామాజిక వ్యవహారాల్లో చాలా పటిష్టంగా వుంది. నేను 2005లో జరిపిన సర్వే ప్రకారం 95 శాతం తగవులు యీ పంచాయతీలే పరిష్కరించేవారు.

కోయ (పోయ), కొండరెడ్డి (పెద్దమనిషి)తో కూడిన ఈ పంచాయతీలకు తోడు వివిధ గ్రామాల మధ్య జరిగే పంచాయతీలు కూడా ఉన్నాయి. వాటికి కూడా ఒక వ్యవస్థ ఉంది. కుల పంచాయతీలను అంగీకరించని వారు చాలా తక్కువ.గౌరవం / భయంతో పంచాయతీ నిర్ణయాలను శిరసావహించేవారు. బ్రిటిష్ పాలన వచ్చేవరకు గిరిజన సామ్రాజ్యాలు బాగానే నడిచాయి. అందుకే కోయలను ఇప్పటికీ 'రాచ కోయలు' , 'దొర చట్టం' అనే పేర్లతో పిలుచుకుంటారు.

గిరిజన సామాజిక వ్యవస్థ కూడా తరతరాల నుండి వస్తున్న వ్యవస్థ. కులం లోపలే పెళ్ళిళ్ళు జరగాలి. కులంలో కూడా గోత్రం / ఇంటి పేరు బయటే జరగాలి. కోయలలో 'గొట్ట' (గోత్రాల సముదాయం) వ్యవస్థ ఉంది. ఇవి మూడు, నాలుగు, ఐదు, ఆరు గొట్ట గోత్రాలుగా పిలుస్తారు. కొన్ని చోట్ల పెరంబోయిలు అనే గోత్రాల సముదాయం ఉంది. ఒకే గొట్టంలో ఉండే గోత్రాలన్నీ అన్నదమ్ముల వరుస. అందుకని వారి మధ్య వివాహాలు నిషిద్ధం. కొండరెడ్లలో ఇంటిపేరు బయటే వివాహాలు జరగాలి. మేనరికాలు వివాహాలకు అర్హాలు. మేనమామ – మేనకోడలు పెండ్లి కూడా సమాజం అంగీకరించిన వివాహాలే. బహు భార్యాత్వం కూడా ఈ మధ్య వరకు ఉండేది. పెండ్లికొడుకు తరపు వాళ్ళే పెండ్లి ఖర్చులు పెట్టుకోవాలి. పెండ్లి కూతురుకు 'ఓలి' ఇవ్వాలి. ఈ మధ్య బయటి సమాజాన్ని అనుకరిస్తూ 'కట్నాలు' అడుగుతున్నారు. విడాకులు తీసుకునేందుకు పురుషుడు కంటే స్త్రీకే స్వాతంత్ర్యం వుంది. వితంతు వివాహం కూడా సామాజికంగా అనుమతించబడింది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ (కమతం) కోయలలో పటిష్టంగా వుండేది. అడవి లోపల, కొండవాలు మీద నివసించే కొండ రెడ్లలో చిన్న కుటుంబాలు ఎక్కువ. వారి పంచాయతీ వ్యవస్థ కూడా చాలా పటిష్టమైనది.

గిరిజన ఆర్థిక వ్యవస్థ కూడా వారు నివసించే ప్రాంతాలను బట్టి తయారు అయింది. అడవిలో నివసించే కొండరెడ్లు చిన్న తరహా అటవీ ఫల సేకరణ, సంచార కొండపోడు వ్యవసాయం చేసుకునేవారు. సేకరించిన అటవీ ఫలసాయాన్ని వారం వారం సంతల్లో అమ్మి వారికి కావలసిన ఉప్పు, చేపలు, మసాలా దినుసులు, బట్టలు లాంటివి కొనుక్కునేవారు. మధ్యవర్తి షావుకారు కొలతలు, ఖరీదు నిర్ణయం, వడ్డీతో పాటు బాకీలు రాబట్టుకోవడంలో మోసాలు లాంటివి సర్వసామాన్యం. అందులో వస్తు మార్పిడి విధానమే ఎక్కువ. కోయలు చాలా కాలం నుంచి స్థిర వ్యవసాయం చేస్తున్నారు. అలాగే గోదావరి గట్టు మీద నివసించే కొండ రెడ్లు కూడా స్థిర వ్యవసాయం చేస్తున్నారు. వీరికి పంట రుణాలు (డబ్బులు, విత్తనాలు లాంటివి) ఇచ్చి గిరిజనేతర వ్యాపారస్తులు, భూస్వాములు వీరి భూములు, పంటలు కాజేయడం, సమకాలీన గిరిజన చరిత్రలో అతి పెద్ద విషాదఘట్టం. దీని వివరాలు తరువాత చర్చిద్దాం.

గిరిజన ఆర్థిక, సామాజిక వ్యవస్థతో నమ్మకం విడదీయరానిది. ప్రతి గ్రామ సరిహద్దుల్లో గ్రామ దేవతలు (పొలిమేర దేవతలు) ఉంటారు. వీరు గ్రామాన్ని కాపాడతారని గిరిజనుల నమ్మకం. అలాగే అడవుల్లో కూడా దేవతలు ఉంటారు. మంచి / చెడు జరగడానికి మంచి దేవుళ్ళు, చెడ్డ దేవుళ్ళు లాంటివి ఉంటారు. పంటలు బాగా పండటానికి, అందరూ ఆరోగ్యంగా వుండటానికి సహాయం చేస్తున్న దేవుళ్ళను "మంచి దేవుళ్ళు"గా అన్ని సందర్భాలలో కొలుస్తారు. వ్యవసాయం మొదలుపెట్టిన దగ్గర నుండి (భూదేవి పండుగ) పంటలు కోసేవరకు చాలా పండుగలు ఉంటాయి. అలాగే అటవీ ఫలసాయం సేకరించే సమయాలలో కూడా పూజలు చేస్తారు. అనారోగ్యం, అకాల మరణాలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలు నాశనం, క్రూరమృగాల దాడి లాంటివి జరిగినప్పుడు చెడు దేవుళ్ళ ప్రభావం అని భావిస్తారు. వాటిని శాంతిపరిచే పూజలు, బలులు లాంటివి చేస్తారు. బయటి ప్రపంచంతో సంబంధం లేనప్పుడు ప్రకృతిలో వచ్చే మార్పులకు 'మానవాతీత శక్తులు కారణం' అని భావించడం కంటే వారు చేసేదేమీ లేదని చాలామంది మానవ శాస్త్రజ్ఞుల అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తా. గిరిజనుల నమ్మకం "మానవుడు – ప్రకృతి – మానవాతీత శక్తుల సమ్మేళనం."

గిరిజన సంస్కృతిలో మరో ముఖ్యమైన భాగం భాష. కోయలకు వారి భాష ఉంది. దీనిని కోయభాష అంటారు. ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. భాషకు 'లిపి' లేదు. కాని ఎన్నో వందల పాటలు, పుక్కిటి పురాణాలు భాష ద్వారా ఒక తరం నుండి మరో తరానికి అందజేయబడతాయి. అపారమైన సాహిత్యానికి సంగీతం, నాట్యం, వాయిద్య సహకారాలు తోడవుతే ఒకటే సంబరాలు. పుట్టుక, వివాహం, చావు, పండుగలు లాంటి జీవిత ప్రక్రియల్లో ఆనంద విషాదాల మధ్య గిరిజన జీవితం నడుస్తుంది. కోయలలో 'కొమ్ము నృత్యం' ప్రత్యేకత సంతరించుకుంది. తలపాగాలో ఎద్దుకొమ్ములు, నెమలి ఈకలు, పెద్ద డోలుతో పురుషులు చేసే నృత్యం అందరినీ ఆకర్షిస్తుంది.

స్త్రీలు చేసే 'థింసా' నృత్యానికి రేల పాటలు తోడైతే దైనందిన కష్టాలను కొంత మర్చిపోతారు కోయలు. అయితే బయటి ప్రజానీకం మాత్రం గిరిజనులు ఎప్పుడు ఆటపాటలతో ఆహ్లాదంగా జీవితం గడుపుతారు అనే అపోహ ఉంది. అపారమైన కష్టాల మధ్య కొంత ఉ పశమనం ఇచ్చేవి మాత్రమే యీ ఆటపాటలు అని గ్రహించాలి. ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్న ఈ సమయంలో ఆటపాటలు కూడా తగ్గిపోతున్నాయని గమనించాలి. భాష, మతం, ఆట, పాట, వేషం, నృత్యం, సాహిత్యం, సంగీతం, వాయిద్యాలు, స్వయంపాలన పంచాయతీలు, స్వయం పోషక వ్యవసాయ పద్ధతులు, ఒక్కొక్కటిగా బయటి ప్రపంచం దాడికి గురి అయ్యాయి. బ్రిటిష్ కాలంలో ప్రారంభం అయిన యీ దాడి, యీ

మధ్య మరీ ఎక్కువ అయింది. ఇప్పుడు సరళీకృత విధానం అమలు తీవ్రతరం కావడంతో మరింత ఎక్కువ ప్రమాదాలకు తావు వుంది. మొత్తం వ్యవస్థ కనుమరుగవుతుందనే భయం కూడా ఉంది.

**స్వయం పాలన నుండి పరాయి పాలనకు**

ఒకప్పటి కోయల సామ్రాజ్యం దేశంలోని గిరిజన సామ్రాజ్యాలన్నిటిలోకి పెద్దది. తెలంగాణ రాష్ట్రంలోని గోండులు కూడా కోయలే. వాళ్ళను 'కోయతూర్' అని, వారి భాషను 'కోయ భాష' అని కూడా పిలుచుకుంటారు. గోండులను రాజగోండులు లేక కోయ రాజాల్ అని పిలిస్తే, కోయలను 'రాచ కోయలు' అని పిలుస్తారు. గోండుల, కోయల భాషలు ద్రవిడ భాషకు చెందినవే కాక చాలా సారూప్యాలు ఉన్నాయి. ఆయా ప్రాంతీయ భాషల ప్రభావం కూడా ఉంది. సమాజ నిర్మాణం కూడా ఒకేరకంగా ఉంటుంది. గోండులలో నాలుగు సగాలు (గోత్రాల గుంపులు) ఉంటే, ఇందాక చెప్పినట్లు కోయలలో ఐదు గొట్టాలు (గోత్రాల గుంపు) ఉంటుంది. గోండు కోయ రాజ్యాలు చిన్న చిన్నవి కలసి పెద్ద సామ్రాజ్యాలుగా వెలసినట్టు చరిత్ర చెబుతోంది. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌తో సహా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిషా రాష్ట్రాలకు వ్యాపించి ఉన్న వీరి ప్రస్తుత నివాస ప్రాంతం ఒకప్పటి కోయరాజ్యం.

బ్రిటిష్ పరిపాలనకు ముందు కోయ రాజ్యాలను హిందూ రాజులు ఆక్రమించుకున్నారు. వీరి ఆక్రమణలో రెండు ఉద్దేశాలు ఉన్నాయి. ఒకటి రాజ్య కాంక్ష. రెండవది బయటి రాజులు దండెత్తినప్పుడు అడవిలో తలదాచుకుని తరువాత గిరిజన రాజుల సహాయంతో బ్రిటిష్ వారితో యుద్ధం చేసి వారి రాజ్యాన్ని తిరిగి పొందగలగడం. అప్పుడప్పుడు వేసవి విడిదిగాను, జంతువులను వేటాడే క్రీడాస్థలాలుగా కూడా అడవులు ఉపయోగపడేవి. అయితే వీరు గిరిజనుల స్వయం పాలనలో ఎప్పుడూ కలుగజేసుకోలేదు. దొరికిన చారిత్రక ఆధారాల బట్టి గిరిజన రాజుల దగ్గర నుండి ఏడాదికి ఒకసారి (సామాన్యంగా దసరా పండుగలలో) భరణాలు (స్వతంత్రాలు, కప్పం) స్వీకరించేవారు. ఇది కూడా అటవీ ఫలసాయం, విలువైన / అందమైన జంతు చర్మాలు, అడవి దున్న కొమ్ములు, ఏనుగు దంతాలు, గంధం చెక్కలు లాంటివి సమర్పించేవారు. దీనికితోడు విల్లంబులు సమర్పించి వారి విధేయతను, సామంత రాజుల స్థాయిని అంగీకరించేవారు.

బ్రిటిష్ ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిజన ప్రాంతాలలోని వనరులు – ముఖ్యంగా అడవిపై ఆధిపత్యాన్ని చాటుకున్నారు. గిరిజనుల సార్వభౌమత్వాన్ని దెబ్బతీసిన ప్రధమ చర్య అటవీ చట్టాల అమలు అని నా నమ్మకం. దాని తరువాత చాలా రకాల దండయాత్రలు

జరిగాయి.

**అటవీ హక్కుల అపహరణ**

"రాష్ట్రంలో గిరిజనులు–సమస్యలు" ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్–2014లో అటవీ హక్కుల సమస్య గురించి వివరంగా రాశాను. ఇక్కడ క్లుప్తంగా వివరిస్తాను.

అడవి తల్లి – గిరిజన బిడ్డ అనేది నానుడి. తరతరాల అనుబంధం చాటుతుంది. ఒకప్పుడు అడవే జీవనాధారం కాబట్టి. ప్రకృతికి సంబంధించినవన్నీ వారి సంస్కృతిలో భాగం అయ్యాయి. చెట్లు, వాగులు, కొండలు, అడవులు, జంతువులు, వారి గ్రామాలు, గోత్రాలు, ఇంటిపేర్లలో చూస్తాము. కొంతమంది వ్యవసాయానికి మారినా అడవి మీద ఆధారం తప్పలేదు. అటవీ ఫల సేకరణదారుల జీవితం పూర్తిగా అడవి మీదే ఉంటే, వ్యవసాయదారులకు వంట చెరకు, వ్యవసాయ పనిముట్లు, ఇళ్ళు కట్టుకునేందుకు / పునర్నిర్మించుకునేందుకు కావలసిన కఱ్ఱలు, దూలాలు, వెదురు (దడి కప్పు), గడ్డి (కప్పు) లాంటి వాటికి అడవే ఆధారం. ఇదే కాకుండా వారి దేవతలు అందరూ అడవిలోనే ఉంటారు. ఉదాహరణకు సమ్మక్క నివాసం చిలకల గుట్ట మీదే కదా. రెండేళ్ళకోసారి పూజారులు జాతర సందర్భంగా మేడారం దగ్గర గద్దెకు వస్తే, జాతర అయిన తరువాత మళ్ళీ జాతర వరకు ఆమె నివాసం చిలకలగుట్టే. అందుకే చుట్టూ అడవి నరికినా, చిలకల గుట్ట మీద అడవి అలాగే వుంది. భద్రాచలంలో గోపన్న గుడి కట్టే వరకు దమ్మక్క నిర్మించిన తాటాకు గుడిసే ఉండేదని చారిత్రక ఆధారాలు వున్నాయి. ఇప్పుడున్న పెద్ద గుడి ప్రక్కన ఉన్న చిన్న గుడిలో పెద్ద బండరాయి ఉంటుంది. అది దమ్మక్క పూజించిన రామాలయం అని స్థానికుల నమ్మకం. అదే కాక దమ్మక్క కోయ యువతి అయి వుండాలి. ఎందుకంటే అక్కడ వేరే జాతివారు యీ మధ్య వరకూ లేరు. ఇప్పటికీ గిరిజన ప్రాంతాలలో దొరికే ఇప్పపూవు ప్రసాదంలో భాగం. తాటిపళ్ళు కూడా పూజలో భాగంగా వుండేదని చెబుతారు. శ్రీశైలం, తిరుపతి స్థల పురాణాల్లో కూడా చెంచులు, ఏనాదులు, పశువుల కాపర్ల కథలు చాలా ఉంటాయి. కాలక్రమేణా గిరిజనులను దూరం చేశారు హైందవ పూజారులు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా ఖమ్మంజిల్లా నుండి నూతన ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని మండలాలు, గ్రామాలు బదిలీ అయిన తరువాత మొత్తం ముంపు ప్రాంతాలు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో తూర్పు, పశ్చిమ గోదావరిలో విలీనం అయ్యాయి. అంతకుముందు కూడా చాలాకాలం క్రితం వరకు భద్రాచలం ప్రాంతం బ్రిటిష్ పరిపాలనా ప్రాంతంలోనే ఉండేది. అందువల్ల బ్రిటిష్ పరిపాలనలో కోయ / కొండరెడ్డి ప్రాంతాల పరిస్థితి క్లుప్తంగా తెలుసుకోవాలి.

**గోదావరి ఏజెన్సీ చరిత్ర అంతా గిరిజన పోరాటాలే**

1855లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డు డల్‌హౌసీ మొట్ట మొదటి అటవీ పాలసీ ప్రకటించారు. తరువాత 1856లో భారత అటవీ శాఖ ప్రారంభించడంతో అడవులన్నీ ప్రభుత్వపరం చేయడం జరిగింది. 1878లో వచ్చిన అటవీ చట్టం ప్రకారం అడవిలోకి వెళ్ళి అటవీ ఫలసాయాన్ని, కలపని తెచ్చుకునేవారిని 'చొరబాటుదార్లు'గా గుర్తించి జరిమానాలు వేసే అధికారం కల్పించడం జరిగింది. దాంతో గిరిజనుల ఆస్తి అయిన అడవి ప్రభుత్వ ఆస్తి అయింది. తరతరాలుగా ఉంటున్న తమ నివాసంలోనే తమను చొరబాటుదార్లుగా పరిగణించడం గిరిజనులు జీర్ణించుకోలేకపోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా ఇదే పరిస్థితి. వివరాలు మరో అధ్యాయంలో తెలుపుతాను.

1907లో హెమింగ్‌వేగారు రాసిన ''గోదావరి జిల్లా' గెజిటీర్లు''లోనూ, శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు రాసిన "ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య పోరాటాల చరిత్ర"లోనూ, 1971లో శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు రాసిన "గిరిజన పోరాటాలు" అనే పుస్తకాలలో గోదావరి ఏజెన్సీలో పోరాటాల విశేషాలు ఉన్నాయి. 1724–1800 మధ్య మొదటి పోరాటాలు జరిగినట్లు ఆధారాలు ఉన్నాయి. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసించే కొండ రెడ్లు ఏలూరు, నిడదవోలు ప్రాంతంపై దాడి చేశారు. అలాగే 1785–1790 మధ్యలో పోలవరం, గూటాల జమిందారీలలో పోరాటాలు జరిగితే మిలటరీ సాయం కావలసి వచ్చిందని 1878లో మోరిస్ హెన్రీగారు రాశారు. రెండు సందర్భాలలోనూ దుర్భేధ్యమైన అడవుల్లో గిరిజనులదే పై చేయి అయింది. బ్రిటిష్ బలగాలు వెనుతిరిగాయి. అయితే వీటిలో గమనించవలసిన విషయం : జమిందార్ల కుతంత్రాలు. బ్రిటిష్‌తో తగవు వచ్చినప్పుడు గిరిజనులను రెచ్చగొట్టడం, గిరిజనులతో తగవు వచ్చినప్పుడు బ్రిటిష్ సైన్యాల సహాయం తీసుకోవడం జరిగేది. జమిందార్లు మాత్రం హాయిగా వుంటే గిరిజనులే బలి అయ్యేవారు. గిరిజన ప్రాంతాలపై ఆధిపత్య పోరాటాల భాగంగానే ఈ అలజడులు జమిందారులు సృష్టించారని వెంకట రంగయ్యగారి అభిప్రాయం. ఇప్పటి ఉభయ గోదావరి జిల్లాలు అప్పటి గోదావరి జిల్లాలో భాగాలే. మొత్తం (11) జమిందారీలు ఉండేవి. 1. పోలవరం 2. గూటాల 3. కొత్తపల్లి 4. బయ్యన్నగూడెం 5. జీలుగుమిల్లి 6. జంగారెడ్డిగూడెం 7. దేవిపట్నం 8. పెద్దాపురం 9. రంప, తోటపల్లి, జడ్డంగి మునసబ్‌దారీలు 10. కోరుకొండ 11. భద్రాచలం, ఈ జమిందారీల ద్వారానే గిరిజన ప్రాంతాల్లో బ్రిటిష్ పాలన సాగించేది. జమిందారులందరి తత్వం ఒకటే అయినా రంప జమిందారు మితిమీరిన చర్యలు చాలా అలజడులకు కారణం అయింది. విచిత్రం ఏమంటే రంప జమిందారు (రంప భూపతిదేవ్)కు వారసత్వం

సమస్య వస్తే బ్రిటిష్ ప్రభుత్వం ఆ జమిందారీని స్వాధీనపరచుకుంది. తరువాత గిరిజన పెద్దల సూచనతో బ్రిటిష్ ప్రభుత్వం జమిందారీని రంప భూపతిదేవ్‌కు అప్పగించింది. కృతజ్ఞత లేని ఈ జమిందారు అదే గిరిజనుల్ని దోచు కోవడం మొదలుపెట్టాడు. ముఠాలు (గిరిజన గ్రామాల గుంపు – గిరిజన పెద్దల ఆధ్వర్యంలో పాలన సాగేది) స్వాధీనపరచుకునేవాడు. ఆబ్కారీ చట్టం, 1864 పేరుతో తాటి పన్ను, ఇప్ప పన్ను, చిగురు పన్ను, మొదలు పన్ను వేసి వాటిని వసూలు చేసుకునేందుకు పోలీసులు సహాయం తీసుకునేవాడు. ఇలాగే దుద్చుర్తి, గుడితేరు, బోదులూరు ప్రాంతాలలో పోలీసులను ఉపయోగిస్తే గిరిజనులు ఆ పోలీసులను పట్టుకుని గ్రామ దేవతలకు బలి ఇచ్చేరని హేమింగ్‌వేగారు రాశారు. 1879లో చంద్రయ్య, సాంబయ్య, తిమ్మన్నదొర, అంబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయి. భద్రాచలం జమిందారుకు అయితే రోహిల్లాలు అనే ప్రైవేట్ సైన్యం ఉండేది. వారికి జీతాలు ఇచ్చేవాడు కాదు. దానికి బదులుగా కోయ గ్రామాలను సమతులు (సుమారు 25 గ్రామాల గుంపు)గా విభజించి రోహిల్లాలను గ్రామాలపై పడి దోచుకోమని అధికారిక ఉత్తర్వులు ఇచ్చేవారు. ఈ ఆగడాలు భరించలేక గిరిజనులు 1802–1803లో తిరగబడ్డారు. దీనినే 'రంప పోరాటం' అని పిలుస్తారు. అల్లూరి సీతారామరాజుగారి నాయకత్వంలో 1920 ప్రాంతంలో జరిగిన గిరిజన పోరాటాలకు వంద సంవత్సరాలకు ముందే ఈ పోరాటం జరగటం గమనించదగ్గది. ఇదేవిధంగా దేశ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో అలజడులు జరిగాయి. అన్నీ కూడా గిరిజన సార్వభౌమత్వాన్ని అణగకొట్టే భూస్వాములకు, వారి ద్వారా పరిపాలన సాగించే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగినవే.

రంప పోరాటానికి కారణాలు తెలుసుకోవలసిందిగా మద్రాసు ప్రభుత్వంలోని రెవెన్యూ బోర్డు మొదటి మెంబర్ హెచ్.ఇ. సుల్లివాన్‌ను బ్రిటిష్ ప్రభుత్వం 1877లో పంపింది. వివరాలన్నీ సేకరించిన తరువాత ఆయన ఇచ్చిన రిపోర్టులో పేర్కొన్న ముఖ్యమైన కారణాలు మూడు : 1. రంప భూపతి ఆగడాలు 2. ఆబ్కారీ చట్టం పేరుతో తాటికల్లు, ఇప్పసారా, చెట్లు, మొదళ్ళు, చిగుళ్ళపై పన్నులు 3. బ్రిటిష్ సివిల్, పోలీసు విధి నిర్వహణలో లోపాలు. ఆయన సలహాలతో రంప మునసబ్‌దారీ రద్దు చేసి 1880లో 19 గిరిజన ముఠాలను, 27 గ్రామాలను గిరిజనులకే అప్పచెప్పడం జరిగింది. అయితే పోడు వ్యవసాయం నిషేధం, ప్రతి ఏడాది పన్నులు వసూలు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి కట్టే బాధ్యత ఈ ముఠాదార్లకు అప్పచెప్పడంలో ఆ బాధ్యతను కొందరు ముఠాదార్లు తిరస్కరించారు. అటువంటి ముఠాదార్లపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంది బ్రిటిష్ ప్రభుత్వం.

దేశవ్యాప్తంగా ఇటువంటి అలజడులు జరుగుతూనే వున్నాయి. దీనితో గిరిజన

ప్రాంతాలను సాధారణ పాలన నుండి విడదీసి ప్రత్యేక పాలనా ప్రాంతాలుగా గుర్తించాలని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించింది. దీని పర్యవసానమే షెడ్యూలు జిల్లాల చట్టం, 1874. ఈ చట్టం ద్వారా గంజాము (అప్పట్లో మద్రాసు ప్రోవిన్సులో వుండేది), విశాఖపట్నం (ఇప్పటి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు), గోదావరి (ఇప్పటి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, భద్రాచలం ప్రాంతంతో సహా) లోని షెడ్యూలు ప్రాంతాలుగా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ఏజెంట్‌గా యీ ప్రాంతాల పరిపాలన నేరుగా చేస్తారు. జిల్లా, రెవెన్యూ కోర్టుల అధికారాలు కలెక్టర్‌కు ఇవ్వబడ్డాయి. ఈ ప్రత్యేక పాలన వల్ల గిరిజనుల పరిస్థితుల్లో పెద్ద మార్పు లేదు. గిరిజనుల భూములు అన్యాక్రాంతం అవుతూనే వున్నాయి. 1915-16లో మళ్ళీ రంప పోరాటాలు సాగి విశాఖ జిల్లాలకు కూడా పాకాయి. ఈ పోరాటాలన్నీ వడ్డీ వ్యాపారులు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా జరిగినవే. దీని పర్యవసానంగా వచ్చినదే ఏజెన్సీ ప్రాంతాలలో వడ్డీలు, భూమి బదలాయింపు చట్టం, 1917. ఇది ఇప్పుడు బదిలీ అయిన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. ఎందుకంటే ఆ ప్రాంతం అప్పటి గోదావరిజిల్లాలో భాగంగా వుండేది.

ఈ చట్టంలో ఏజెన్సీ ప్రాంతాలు, కొండజాతులు (హిల్ ట్రిబ్యు), స్థిరాస్తిలాంటివి నిర్వచించి కొండజాతుల మధ్య తప్పిస్తే, ఇతర జాతులతో భూమి బదలాయింపు చెల్లదు అని చెప్పారు. అయితే జిల్లా కలెక్టర్ (ఏజెంట్) అనుమతితో అటువంటి బదలాయింపు జరగవచ్చును. వడ్డీని, వడ్డీ వ్యాపారాన్ని క్రమబద్దీకరించడానికి అధికారాలు ఉన్నాయి. అయితే ఈ చట్టం కూడా అమలు అయినట్లు దాఖలాలు లేవు. ఎందుకంటే చట్టం వచ్చిన మరో (5) సంవత్సరాలలోనే (1922-24) గోదావరి, విశాఖపట్నం జిల్లాలో అల్లూరి సీతారామరాజుగారి నాయకత్వంలో గిరిజనులు పోరాటాలు చేశారు. బాష్టియన్ అనే తాసిల్దారు క్రూరత్వం, వెట్టిచాకిరి చెయ్యనివారి పశువులను జప్తు చేయడం, పోడు వ్యవసాయం నిషేధం, చిన్న తరహా అటవీ సంపద సేకరణపై ఆంక్షలకు వ్యతిరేకంగా యీ పోరాటాలు సాగాలని మామిడిపూడి వెంకట రంగయ్య, వెన్నెలకంటి రాఘవయ్యగార్లు పేర్కొన్నారు.

1921లో నాలుగు ఏజెన్సీ తాలూకా బోర్డులు స్థాపించారు. ఇవి (1) కోరాపుట్ (2) నర్సీపట్నం (3) పార్వతీపురం (4) రంపా. వీటిద్వారా ప్రాంతీయ పరిపాలన సాగించాలి. అయితే 1936లో వీటిని రద్దు చేశారు. ఈ బోర్డులు 1921-1936 మధ్యలో అమలు చేసిన కార్యక్రమాల వివరాలు సేకరించడానికి నాలుగు ఏజెన్సీలతో వివిధ సందర్భాలలో తిరిగినప్పుడు ప్రయత్నించాను. వివరాలు దొరకలేదు. 1917 యాక్టు వచ్చిన దగ్గర నుండి 'ఏజెన్సీ ప్రాంతాలు' అనే పదం ప్రచారంలోకి వచ్చింది. ఇప్పటికీ అధికారికంగా అదే పేరు ఉంది. తరువాత

1935 చట్టం వచ్చింది.

భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూలులకు బ్రిటిష్ కాలం నాటి 1935 యాక్టుకు పోలికలు వున్నాయి. దేశంలోని గిరిజన సాంద్రత ఎక్కువ వున్న ప్రాంతాలను రెండు భాగాలుగా విడదీశారు. ఈశాన్య ప్రాంతంలోని గిరిజన ప్రాంతాలు ప్రక్క దేశాలకు సరిహద్దులో వున్నాయి కాబట్టి వారిని 'పూర్తిగా తప్పించిన' ప్రాంతాలుగా గుర్తించి బయటి జనాభా ప్రవేశం కూడా నిషేధించారు. అయితే మధ్య భారతదేశంలోని గిరిజన సాంద్రత ఎక్కువగా వున్న ప్రాంతాలను 'పాక్షికంగా తప్పించిన ప్రాంతాలు'గా గుర్తించారు. సామాన్య చట్టాలు గవర్నర్ ప్రత్యేక ఆమోదం పొందితేనే ఈ ప్రాంతాలకు వర్తిస్తాయి. దీనివల్ల ప్రతి సామాన్య చట్టం గిరిజన ప్రాంతాలను అలాగే వర్తింప చెయ్యాలా లేక మార్పులతో వర్తింప చెయ్యాలా లేక అసలు వర్తింప చేయకుండా చెయ్యాలా అనే నిర్ణయం తీసుకునే అధికారం ఉండేది. రాజ్యాంగం వచ్చిన తరువాత ఈ పద్ధతి మారింది.

**భారత రాజ్యాంగం - ఐదవ షెడ్యూలు**

ముంపు ప్రాంతాలు ఇంచుమించుగా అన్నీ ఐదవ షెడ్యూలు ప్రాంతాలలోకి వస్తాయి కాబట్టి రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు గురించి, ఆ ప్రాంతంలో చెల్లుబాటులో వున్న సామాన్య చట్టాలు, ప్రత్యేక చట్టాలు, రాజ్యాంగ సంస్థలు లాంటి విషయాలపై పూర్తి అవగాహన వుండాలి.

1874లో వచ్చిన షెడ్యూలు జిల్లాలు చట్టం అప్పటి విశాఖపట్నం, గోదావరి జిల్లాలకు వర్తిస్తుందని ఇంతకుముందే తెలిపా. 1917 చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతాలుగా ప్రకటించి భూమి బదలాయింపును నిరోధించడానికి, వడ్డీ వ్యాపారాన్ని క్రమబద్ధీకరించడానికి మొదటి ప్రయత్నం జరిగింది. భారత రాజ్యాంగం 1950లో వచ్చిన తరువాత భారత రాష్ట్రపతిచే షెడ్యూలు ప్రాంతాలుగా ప్రకటించబడ్డాయి.

1950లో ఇచ్చిన ఉత్తర్వులు రెండు. అవి మద్రాసు ప్రాంతానికి, హైదరాబాద్ ప్రాంతానికి వేరు వేరుగా ఇచ్చినవి. మద్రాసు ప్రాంతం (అంటే ఇప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రాంతం)లో ఏజెన్సీ ట్రాక్టులు (ప్రాంతాలు)గా గుర్తిస్తే, హైదరాబాద్ ప్రాంతం (అంటే ఇప్పటి తెలంగాణా ప్రాంతంలో) నోటిఫైడ్ గ్రామాలను ప్రకటించారు. ఇవన్నీ రాజ్యాంగం ప్రకారం షెడ్యూలు గ్రామాలుగా పిలవబడతాయి. అలాగే హైదరాబాద్ ప్రాంతంలో నోటిఫైడ్ గిరిజన తెగలుగా ప్రకటిస్తే, మద్రాసు ప్రాంతంలో హిల్‌ట్రైబ్స్‌గా ప్రకటించారు. రాజ్యాంగం వచ్చిన తరువాత అందరినీ షెడ్యూలు తెగలుగా గుర్తిస్తూ ప్రకటన వచ్చింది. 1950 నుండి 2014 వరకు యీ జాబితాలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

**గోదావరి జిల్లాలో షెడ్యూలు ప్రాంతాల వివరాలు ఇలాగ వున్నాయి**

| క్రమ సంఖ్య | జిల్లా | షెడ్యూలు ప్రాంతం* (చ.కి.మీ.) | షెడ్యూలు* గ్రామాలు |
|---|---|---|---|
| 1. | తూర్పు గోదావరి | 4191.65 | 559 |
| 2. | పశ్చిమ గోదావరి | 1006.10 | 102 |

*** గమనిక :** ఖమ్మం జిల్లా నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు బదిలీ అయిన షెడ్యూలు గ్రామాలు, వాటి విస్తీర్ణం కలిపితే పై గణాంకాలు మారుతాయి.

ఐదవ షెడ్యూలు ప్రాంతాల పరిపాలనకు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలులోని అంశాలు చాలా ముఖ్యం. ఇదే కాకుండా రాజ్యాంగంలోని చాలా అంశాలు కూడా గిరిజన అభివృద్ధికి / రక్షణకు దోహదం చేస్తాయి. అయితే ఇక్కడ ఐదవ షెడ్యూలుకు వర్తించే విషయాలు మాత్రమే చర్చిద్దాం.

**ఐదవ షెడ్యూలు**

ఐదవ షెడ్యూలును 'రాజ్యాంగంలో రాజ్యాంగం'గా పిలుస్తారు. ఎందుకంటే యీ ప్రాంత పరిపాలనకు రాష్ట్ర గవర్నర్‌కు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడ్డాయి.

(1) షెడ్యూలు ప్రాంతాల పరిపాలనపై ప్రతి సంవత్సరం కాని, రాష్ట్రపతి ఎప్పుడు అడిగినా సరే ఒక నివేదిక పంపాలి.

(2) గిరిజన సలహా మండలి ముఖ్యమైనది. దీంట్లో 20 మంది సభ్యులుఉంటే రాష్ట్రంలో ఎన్నికైన గిరిజన శాసనసభ్యులు అందరూ ఉంటారు. అధికారులు ఉంటారు. ప్రభుత్వం కోరిన విషయాలపై గిరిజన సలహా మండలి సలహాలు ఇస్తుంది. దీనిని 'చిన్న చట్టసభ' అంటారు. ఎందుకంటే సలహా మండలి తీర్మానాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలను నేరుగా తీసుకోవచ్చు.

(3) ఐదవ షెడ్యూలు ప్రకారం రాష్ట్రపతికి రెండు ప్రత్యేక శాసన అధికారాలు ఉన్నాయి. (i) అమలులో ఉన్న కేంద్ర, రాష్ట్ర చట్టాలను షెడ్యూలు ప్రాంతాలకు పాక్షికంగా గాని, మార్పులతో కాని వర్తింప చేసేందుకు గవర్నర్‌కు అధికారాలు వున్నాయి; షెడ్యూలు ప్రాంతంలోని భూమి అన్యాక్రాంతం కాకుండాను, షెడ్యూలు ప్రాంతంలో వడ్డీ

వ్యాపారం నియంత్రణకు ప్రత్యేక రెగ్యులేషన్‌ను తీసుకురావచ్చు. దీనికి గిరిజన సలహా మండలి ఆమోదం, రాష్ట్రపతి ఆమోదం కావాలి. షెడ్యూలు ప్రాంతాలలో స్థానిక గిరిజనులకు ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిన నోటిఫికేషన్లు మొదటి అధికారంతో ఇస్తే, ఆంధ్రప్రదేశ్ (షెడ్యూలు ప్రాంతాల) భూమి బదలాయింపు చట్టం, 1959 (దానికి సవరణలు) వడ్డీ వ్యాపారం, రుణ విముక్తికై చేసిన మరికొన్ని రెగ్యులేషన్లు రెండవ అధికారంతో వచ్చినవే.

తూర్పుగోదావరి జిల్లాకు వర్తించే ముఖ్యమైన మరో రెగ్యులేషన్ – ఆంధ్రప్రదేశ్ ముఠాలు (రద్దు, రైతువారీగా మార్పు) రెగ్యులేషన్ 1969. దీని ప్రకారం ముఠాలను రద్దు పరచి రైతులకు రైతువారీ పట్టాలు ఇవ్వాలి. అయితే గిరిజనేతరులకు 1959 షెడ్యూలు ప్రాంతాల భూమి బదలాయింపు చట్ట వ్యతిరేకంగా పట్టాలు ఇవ్వదు. భద్రాచలం ప్రాంతంలోని మహాళ్ళు (రద్దు, రైతువారీగా మార్పు) చేసే రెగ్యులేషన్ 1969 కూడా ఇలాంటిదే. అలాగే ముఠా ప్రాంతాలు కాని, షెడ్యూలు ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు ప్రాంతాల రైతువారీ సెటిల్‌మెంట్ రెగ్యులేషన్, 1970 ప్రకారం ఆ ప్రాంతాలు సర్వే చేసి రైతువారీ పట్టాలు ఇవ్వాలి. ఇవి కూడా 1959 షెడ్యూలు ప్రాంతాల భూమి బదలాయింపు చట్టానికి వ్యతిరేకంగా ఇవ్వరాదు.

ఇదేకాకుండా ఎస్సైన్డ్ భూముల (బదలాయింపు నిరోధం) చట్టం, 1977 ప్రకారం కూడా ఎస్సైన్డ్ భూములు వేరే వారికి బదలాయించరాదు. షెడ్యూలు ప్రాంతంలో ఎస్సైన్డ్ భూముల లావాదేవీలు 1959 చట్టం పరిధిలోకి కూడా వస్తాయి. మరో ముఖ్యమైన చట్టాలు అటవీ చట్టం (ఉమ్మడి అటవీ యాజమాన్యం), 1988 – అటవీ హక్కుల చట్టం, 2006 – పీసా చట్టం, 1998 – విద్యా హక్కు చట్టం, 2009 – ఉపాధి హామీ చట్టం లాంటివి కూడా చాలా ముఖ్యమైనవి. ఒక్కొక్క చట్టంలో వివరాలు క్లుప్తంగా చెబుతూ ముంపు ప్రాంతాలలో వీటి అమలు గురించి ఇప్పుడు చర్చిద్దాం.

**అన్నీ ఉల్లంఘనలే**

**(i) భూమి బదలాయింపు చట్టాలు అమలు కాలేదు**

ఇంతకు ముందు చెప్పినట్టు ముంపు ప్రాంతాల్లో భూమి బదలాయింపు చట్టాలు 1917 నుంచి ఉన్నాయి. అంటే మరో రెండేళ్ళకు 100 సంవత్సరాలు పూర్తి అవుతాయి. 1917 చట్టం ప్రకారం కొండ జాతుల మధ్య తప్పించి వేరే జాతుల మధ్య భూమి బదలాయింపు చెల్లదు (ఏజెంట్ – జిల్లా కలెక్టర్ అనుమతితో తప్ప). అయితే అటువంటి అనుమతులు ఇచ్చినట్లు దాఖలాలు నాకు దొరకలేదు. అసలు గిరిజనేతరుల జనాభాలో ఎక్కువ మంది గత

60 సంవత్సరాలుగా వలసదారులే. ఎవరైనా అటువంటి అనుమతి పత్రం పొందినట్టు చూపిస్తే, ఆ కాగితం ఎన్ని సంవత్సరాల క్రితంది అనేది చూడాలి. ఫోరెన్సిక్ పరీక్షకు పంపితే తెలుస్తుంది. అది ఈ మధ్య సృష్టించిన కాగితం అని.

1959 భూమి బదలాయింపు చట్టం ప్రకారం బదలాయింపు అనే పదానికి విస్తృతమైన అర్థం చెప్పారు. కొనుగోలు, కౌలు, కుదువ పెట్టడం, ఏ విధమైన లావాదేవీలు చెల్లవు. కాని అధికారుల సహాయంతో గిరిజనుల భూమి బదలాయింపు జరిగింది. ఇది కాకుండా కౌలుకు ఇచ్చిన భూమి చాలా ఉంది. ఇది లెక్కలలోకి రాదు. ఎందుకంటే యీ బదలాయింపు నోటి మాట మీద జరుగుతూ ఉంటుంది. సామాన్యంగా తీసుకున్న రుణాలు తీర్చలేని సందర్భాలలో యీ రకమైన బదలాయింపు జరుగుతూ ఉంటుంది. 1/70 సవరణ ప్రకారం భూమిని చట్టరీత్యా అనుభవిస్తున్నట్లు తెలిపే బాధ్యత గిరిజనేతరుల మీదే పెట్టారు. గిరిజనేతరుల మధ్య లావాదేవీలు నిషిద్ధం. (1/70) ఈ చట్టం ఉల్లంఘన చేసిన వారికి జైలు శిక్ష ఉంటుంది. అయితే గిరిజనుల అమాయకత్వం, నిజాయితీ, కొన్ని సందర్భాలలో అన్నీ తెలిసి ఏమీ చేయలేని ఆర్థిక దుర్బలత్వం వల్ల భూమిని కౌలుకు ఇస్తారు. పశ్చిమ గోదావరిజిల్లాలో కన్నాపురం, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి ప్రాంతాలలో కొంతమంది గిరిజనుల భూములు చాలా తరాలుగా కౌలుకు ఇవ్వటం వల్ల ప్రస్తుత తరం వారికి ఆ భూములు తమవే అనేది తెలియని పరిస్థితి నెలకొనింది. ఆ మధ్యన సిపిఎం పార్టీ తరఫున గిరిజనులు పోరాటాలు చేస్తే కొన్ని రికార్డులు సరిచేయటం, కొత్త రెవెన్యూ డివిజన్ నెలకొల్పడం తప్పించి పెద్దగా ఉపయోగం జరగలేదు. విసిగిపోయిన గిరిజనులు పంటల్ని కోసుకుంటే అరెస్టులు, జైళ్ళు, లాఠీఛార్జీలు లాంటివి మాత్రం జరిగాయి. ఇదేకాకుండా 2004లో కొంతమంది మండల రెవెన్యూ అధికారుల సహాయంతో పశ్చిమ గోదావరిజిల్లా ఏజెన్సీలో నకిలీ హైకోర్టు ఆర్డర్లు గిరిజనేతరులు సృష్టించారు. సి.ఐ.డి. వారి దర్యాప్తులో 2937.60 ఎకరాలకు 367 నకిలీ హైకోర్టు ఉత్తర్వులను సృష్టించినట్లు తేలింది. దీంట్లో అధికారుల పాత్ర ఉందని కూడా తేలింది. ఆ ఉత్తర్వులు చెల్లకపోయినా, గిరిజనేతరులు అధికారుల సహాయంతో ఎటువంటి తెగింపుకు దిగారనేది గమనించదగ్గది. భూమి బదలాయింపు చట్టం, 1959ను అమలు పరిచేందుకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులను కూడా నెలకొల్పారు. ఈ పోస్టు ఎప్పుడూ ఖాళీయే. ఎవరో ఒకరు అదనపు ఛార్జీతో ఉంటారు. వారికి కూడా ఏ విధమైన ఇష్టం ఉండదు. కాని అదనపు చార్జీ జీతం మాత్రం తీసుకునేవారు. ప్రమోషన్ల సమయాలలో అయితే యీ పోస్టును చూపించి డిప్యూటీ కలెక్టర్ నుంచి పదోన్నతులు పొందుతారు. తరువాత అంతా మామూలే.

కొంతమంది అధికారులైతే గిరిజనేతరులకు అనుకూలంగా ఆర్డర్లు ఇచ్చి ధనాన్ని సమకూర్చుకున్నట్లు ఆరోపణలు వున్నాయి. గిరిజనులకు తెలియకుండానే యీ ఉత్తర్వులు ఇచ్చినట్లు తరువాత చేసిన సర్వేలలో తేలింది. ఏది ఏమైనా గిరిజనులు 50 శాతంకు పైగా భూమిని కోల్పోయిన విషయం ప్రభుత్వ లెక్కల్లోనే అంగీకరించారు.

గిరిజనుల తరతరాల పోరాటాల ఫలితంగా గిరిజన ముఠాదార్లు వచ్చారు. వారి పరిపాలన క్రిందే గిరిజన గ్రామాల పాలన సాగిందని ఇంతకుముందే తెలిపాను. అయితే 1969లో వచ్చిన రెగ్యులేషన్ ప్రకారం ముఠాలను రద్దుచేసి, రైతువారీ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ ముఠాలు తూర్పుగోదావరి, విశాఖ ఏజెన్సీలలో ఉన్నాయి. అలాగే అదే సంవత్సరంలో ఖమ్మం జిల్లాలోని నూగూరు, అలబాక, చెర్లలోని మహళ్ళను కూడా రద్దు చేశారు. ముఠాదార్ల, మహల్‌దార్ల హక్కులన్నీ రద్దు చేసి ఆ భూములన్నీ ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు. డైరెక్టర్, సెటిల్‌మెంట్‌వారు సర్వేచేసి రైతువారీ పట్టాలు ఇవ్వాలి. అయితే రైతువారీ పట్టా ఇచ్చేటప్పుడు గిరిజనేతరుల స్వాధీనంలో వున్న భూమి ఎల్.టి.ఆర్. చట్ట వ్యతిరేకంగా ఉండకూడదు. అలాగే ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు ప్రాంతాల రైతువారీ సెటిల్‌మెంట్ రెగ్యులేషన్, 1970 ప్రకారం మిగిలిన ఏజెన్సీ భూములు సర్వే చేసి రైతువారీ పట్టాలు ఇవ్వాలి. దీనిలో కూడా భూమి బదలాయింపు చట్టానికి (ఎల్.టి.ఆర్.) వ్యతిరేకంగా గిరిజనేతరుల స్వాధీనంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వరాదు. కాని ఈ మూడు చట్టాల అమలులో గిరిజనులకంటే గిరినేతరులే ఎక్కువ లాభ పడ్డారు. ఇది సోచనీయం.

సమత కేసులో సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఏజెన్సీ ప్రాంతాలలోని భూమిని గిరిజనులకు మాత్రమే బదలాయించాలి. ప్రభుత్వ భూమిని కూడా గిరిజనేతరులకు బదలాయించే అధికారం ప్రభుత్వానికి లేదు. అంటే ఏజెన్సీ ప్రాంతంలోని భూమి గిరిజనులకే చెందాలి.

1977లో వచ్చిన ఆంధ్రప్రదేశ్ ఎస్సైన్డ్ భూములు (బదలాయింపుపై నిషేధం), చట్టం ప్రకారం యీ భూములు బదలాయింపు నిషిద్ధం. ఈ చట్టం రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది. అయితే ఏజెన్సీ ప్రాంతంలో అసలు గిరిజనేతరులకు ఎస్సైన్‌మెంట్ (పంపిణీ) చేయకూడదు. కాని కొన్ని లక్షల ఎకరాలు, ముఖ్యంగా ఇళ్ళ పట్టాల పేరుతో ఎస్సైన్‌మెంట్ జరిగిపోయింది. కోనేటి రంగారావుగారి కమిషన్ రిపోర్టులో ఈ వివరాలు వున్నాయి. ఇవన్నీ జరగడానికి గిరిజనుల అమాయకత్వం ఒక కారణమైతే, అధికారుల చేతివాటం మరో కారణం. గిరిజనులకు న్యాయ సలహా ఇచ్చే వ్యవస్థ లేదు. భూమి బదలాయింపు వివరాలు ఒకసారి చూద్దాం.

| క్రమ సంఖ్య | వివరాలు | తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి |
|---|---|---|---|
| 1. | ఎ. మొత్తం కేసుల నమోదు | 8,260 | 11,079 |
| | బి. విస్తీర్ణం (ఎకరాలు) | 48,494 | 56,401 |
| 2. | ఎ. నిర్ణయించినవి | 7,993 | 10,953 |
| | బి. ఎకరాలు | 47,487 | 56,184 |
| 3. | ఎ. గిరిజనులకు అనుకూలంగా నిర్ణయించినవి | 3,548 | 2,429 |
| | బి. ఎకరాలు | 18,947 | 10,018 |
| 4. | ఎ. గిరిజనేతరులకు అనుకూలంగా నిర్ణయించినవి | 4,361 | 5,122 |
| | బి. ఎకరాలు | 28,540 | 29,677 |
| 5. | ఎ. గిరిజనులకు స్వాధీనపరచినవి | 3,303 | 2,419 |
| | బి. ఎకరాలు | 13,909 | 9,955 |

**ఆధారం : కోనేరు రంగారావు భూమి కమిటీ రిపోర్టు-2006, పేజీ 59.**

తూర్పు గోదావరి ఏజెన్సీలో 60% భూమిని గిరిజనేతరులకే నిర్ణయిస్తే, పశ్చిమ గోదావరి ఏజెన్సీలో 52% భూమిని గిరిజనేతరులకు నిర్ణయించారు. ఖమ్మం జిల్లా నుండి బదిలీ అయిన ప్రాంతాలలో కూడా ఈ చట్టం అమలు ఘోరమే. అయితే ఈ మండలాలకు సంబంధించిన గణాంకాలు వేరేగా దొరకలేదు. జిల్లా ఏజెన్సీ మొత్తానికి వివరాలు తీసుకుంటే 59% భూమి గిరిజనేతరులకే చెందేలా నిర్ణయాలు జరిగాయి. అంటే మూడు ఏజెన్సీలు కలపి 1,28,781 ఎకరాల భూమి గిరిజనేతరుల పరం అయింది. అధికారికంగా ఐదవ షెడ్యూలు క్రింద వచ్చిన చట్టం గిరిజనేతరులకే ఎక్కువ ఉపయోగించేలా చేసిన ప్రత్యేక యంత్రాంగాన్ని గిరిజనులు దుయ్యబట్టని రోజు లేదు. అసంతృప్తి పెరిగింది. దీనికి తోడు పట్టాలు ఉండి భూమి చూపనివాళ్ళు, భూమి ఉండి పట్టాలు లేనివారు, ఇంకా తాతల పేరు మీదే పట్టాలు వున్న వాళ్ళు కోకొల్లలు.

భూమిని కోల్పోవటం, కుటుంబాలు పెరగడం వల్ల అడవిలోకి వెళ్ళి వ్యవసాయం

మొదలుపెట్టారు. ఒక ప్రక్కన అడవి గిరిజనులది కాదు అనగానే వచ్చే బాధ కంటే, అటవీ శాఖ గార్డు అదుపాజ్ఞలలో జీవితం గడపాలనే భావన గిరిజనులు జీర్ణించుకోలేకపోయారు. అటవీ హక్కుల నిరాకరణ, పర్యవసానం ఒకసారి పరిశీలిద్దాం.

**(ii) అటవీ హక్కుల నిరాకరణే ఎక్కువ**

అటవీ హక్కుల నిరాకరణ బ్రిటిష్ కాలంలో మొదలైతే, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అదే పరిస్థితి కొనసాగింది. అప్పుడప్పుడు సమస్య తీవ్రతరం దాల్చింది కూడా. ముంపు ప్రాంతాలకు వర్తించే అటవీ చట్టాలు, సంబంధిత పాలసీలు లెక్కలు తెలుసుకుందాం.

**(ఎ) ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, 1967**

1882లో అప్పటి మద్రాసు రాష్ట్రం అటవీ చట్టాన్ని తెచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952లో జాతీయ అటవీ పాలసీని ప్రకటించారు. ఇది బ్రిటిష్ వలసవాద విధానానికి ఏ విధంగాను భిన్నంగా లేదు. అంతకంటే అన్యాయంగా ఉన్నదని ధేబర్ కమిషన్ పేర్కొన్నారు. గిరిజనుల అధికారాలను సదుపాయాలుగా మార్చారు అని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో కూడా, అందునా 1950లో రాజ్యాంగం వచ్చిన తరువాత కూడా గిరిజనుల జీవన విధానం అటవీ రక్షణకు వ్యతిరేకంగా ఉంటుందనే భావనను కలుగజేసేదిగా ఉంది ఈ అటవీ విధానం.

**(బి)** (1) పోడు వ్యవసాయం తగ్గించడం, (2) అడవిలో పశువులను మేపకుండా చేయడం (3) గిరిజనాభివృద్ధి చేయడం లాంటివి ఈ పాలసీలో ముఖ్యాంశాలు. అయితే అడవిలో చేపట్టిన కార్యక్రమాలు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఏ విధంగాను తోడ్పడలేదు. "అడవి దగ్గర్లో చవకగా దొరికే కూలీలు"గానే వారిని చూడసాగారు. టేకు, యూకలిప్టస్ లాంటి చెట్లు పెంచేందుకు "తుప్పలు" నరికితే, మాయమైనవి అమూల్యమైన వనమూలికలు అని చాలాకాలం తరువాత గుర్తించారు. ఇప్పుడు వనమూలికల పార్కుల ప్రోగ్రాం పెట్టారు. తరువాత దీనితో పాటు అడవి కోళ్ళు, కుందేళ్ళు లాంటి చిన్న జంతువులకు ఆవాసం పోయింది. "కొండనాలికకు మందేస్తే, ఉన్న నాలిక పోయిందన్న" సామెత రుజువు అయ్యింది.

ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, 1967 వచ్చిన తరువాత మద్రాసు అటవీ చట్టం రద్దు అయింది. అయితే రెండు చట్టాలలో చాలా సారూప్యం ఉంది. మద్రాసు చట్టంలోను, ఆంధ్రప్రదేశ్ చట్టంలోనూ ప్రభుత్వానికి ఏదైనా ప్రాంతాన్ని రిజర్వు అడవిగా ప్రకటించేందుకు అధికారం ఉంది. ఆ ప్రకటన సరిహద్దులతో సహా ప్రకటించాలి. దీనిని 'ఉద్దేశ ప్రకటన' అంటారు. దాని తరువాత అదే చట్టం ప్రకారం అటవీ సెటిల్‌మెంట్ అధికారిని నియమించాలి. రెవెన్యూ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో వున్న అధికారిని యీ పోస్టులో నియమించాలి. అయితే ఇది 'లాభదాయక పోస్టు' కాదు. అందుకే ఎవరూ దీంట్లో నిలకడగా ఉండేవారు

కాదు. పై అధికారుల మాట విననివారు, ఏదైనా క్రమశిక్షణ చర్యకు లోనై మళ్ళీ ఉద్యోగంలో చేరినవారు, దీర్ఘకాలిక అనారోగ్యంతో  బాధపడుతూ వున్నవారు, పదవీ విరమణ దగ్గర పడ్డవారిని ఇక్కడ నియమిస్తారు. ఉద్యోగులపై క్రమశిక్షణ చర్య ఏమోగాని, గిరిజనులకు కష్టాలు మాత్రం ఎక్కువ అవుతాయి వీరివల్ల. భూమి బదలాయింపు చట్టం అమలు చేయవలసిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నియామకంలాగే యీ పోస్టు కూడా ప్రమోషన్ల సమయంలోనే గుర్తుకు వస్తుంది. పదోన్నతి రాగానే యీ పోస్టులో చేరటం, రెండవ రోజు నుండి ఎప్పుడు బయట పడదామా అనే ప్రయత్నాలు చేస్తారు చివరికి చేయవలసిన పని చేయరు. దీని పర్యవసానం గిరిజన జీవితాలపై భయంకర ప్రభావం చూపెట్టింది. అసంపూర్తిగా వదిలిన పని కొంత పరిశీలిద్దాం.

అటవీ సెటిల్‌మెంట్ అధికారిని నియమించిన తరువాత సరిహద్దులను నిర్ణయిస్తూ అతడు / ఆమె ఒక నిర్దిష్టమైన ప్రకటన చెయ్యాలి. ఆ ప్రకటనను అన్ని ఆవాసాలలోను ప్రాంతీయ భాషలలో ప్రకటించాలి. గిరిజనులకు ప్రాంతీయ భాష కూడా అప్పట్లో రాదు కాబట్టి గిరిజన భాషలలోనే టముకు వెయ్యాలని బ్రిటిష్ కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. ప్రకటిత ప్రాంతంలోనూ, ప్రక్క ప్రాంతంలోనూ నివసించే ప్రజలకు ఈ ప్రాంతంపై ఉండే జీవన హక్కులు నిర్ణయించాలి. వ్యవసాయ భూములు, ఆవాసాలు, గ్రామానికి / త్రాగునీటికి ఉండే బాటలు నిర్ణయించాలి. ఆయా ప్రాంతాల ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించి పరిశీలించాలి. ఈ హక్కులన్నీ నిర్ణయించిన తరువాతే రిజర్వు అడవిగా తుది నోటిఫికేషన్ ఇవ్వాలి. మొదట్లో అలసత్వం, తరువాత అధికారులకు శ్రద్ధ లేకపోవడం వల్ల బ్రిటిష్ కాలంలో మద్రాసు యాక్టు క్రింద, 1967 అటవీ చట్టం క్రింద ఉద్దేశ ప్రకటన అటవీ ప్రాంతాలలో కూడా హక్కుల నిర్ధారణ కాలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30 లక్షల ఎకరాలలో ఈ హక్కుల నిర్ధారణ దశాబ్దాలుగా కాలేదని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

కాలయాపన వల్ల ఆంధ్రప్రదేశ్, అటవీ చట్టం 1967లోని కొన్ని వెసులుబాటులు ఉపయోగించుకోలేకపోయారు. గిరిజనుల, అడవి మీద సాంప్రదాయకంగా జీవించే వారి హక్కులు నిర్ణయించబడలేదు. "ఆలస్యం అమృతం విషం" అనే నానుడి నిజమైంది.

**(బి) అటవీ జంతువుల (వన్యప్రాణి) రక్షణ చట్టం, 1972**

ఈ చట్ట ప్రకారం వన్యప్రాణుల రక్షణ, అభివృద్ధికై వాటి నివాస ప్రాంతాన్ని అభయారణ్యాలుగా ప్రకటించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. ప్రకటించిన ప్రాంతాలలోని ప్రజల హక్కులు నిర్ణయించే బాధ్యత కలెక్టరుపై ఉంచారు. ప్రజల దగ్గర నుండి అభ్యంతరాలు స్వీకరించి పరిశీలించాలి. హక్కులన్నీ నిర్ణయించిన తరువాతే తుది ప్రకటన చెయ్యాలి. దేశంలో

ఏ అభయారణ్యానికి వెళ్ళినా స్థానిక ప్రజలు చెప్పేది ఒక్కటే. చట్టంలో పేర్కొన్న ప్రజాస్వామ్యక ప్రక్రియ ఏదీ జరగలేదని. అభయారణ్య అధికారులు కేసులు పెట్టేవరకూ అభయారణ్యంలో నివసిస్తున్నామని, విల్లంబులు, చిన్న చిన్న వలలు లాంటి వాటితో వేటాడటం కూడా శిక్షార్హమని వారికి తెలియదు. భూదేవి పండుగ సందర్భంగా తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక వేట కూడా నిషిద్ధం అయింది. ఆకలికో, పండగలు చేసుకున్నప్పుడో వేటాడితే పడే శిక్షతో పండుగ సరదా ఆవిరయ్యేది. పాపికొండల అభయారణ్యం పోలవరం ప్రాజెక్టు క్రింద మునిగిపోతుందని వన్యప్రాణి ప్రేమికులు బాధపడితే, సుందరమైన జీవవైవిధ్యం మాయమవుతుందని ప్రకృతి / పర్యావరణ ప్రేమికులు బాధపడుతున్నారు. ఈ ప్రకృతిని పునర్నిర్మించడం ఎవరి తరం. ముంచడం చాలా తేలిక.

**(సి) కేంద్ర అటవీ చట్టం, 1980**

కేంద్ర అటవీ చట్టం, 1980 ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా (1) రిజర్వు అడవిని రిజర్వేతర అడవిగా మార్చడం (2) రిజర్వు అడవిని రిజర్వేతర భూమిగా వాడటం (అంటే టీ, కాఫీ, పండ్ల తోటలు పెంచడం, (3) రిజర్వు అడవిని వ్యక్తులకు, ప్రైవేట్ సంస్థలకు పంచడం, కౌలుకు ఇవ్వటం (4) ప్రకృతిసిద్ధంగా పెరిగిన చెట్లను అడవుల పెంపకానికి అనువుగా నరకడం లాంటివి నిషిద్ధం. చట్టాన్ని అతిక్రమించిన ప్రభుత్వ అధికారులకు, సంస్థల అధికారులకు, వ్యక్తులకు 15 రోజుల వరకు జైలు శిక్ష వేయవచ్చు. చట్టాన్ని అమలు పరిచేందుకు మొదట 1981లో రూల్సు వచ్చాయి. ఇవి రద్దు పరుస్తూ 2003లో కొత్త రూల్సు వచ్చాయి.

1980 చట్టం వచ్చిన తరువాత రాష్ట్ర చట్టంలోని వెసులుబాటు కూడా పోయింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి అంటే అది చాలా పెద్ద తతంగం. పారిశ్రామికవేత్తలకు, గనుల కాంట్రాక్టర్లకు తప్పించి సామాన్య ప్రజలకు సాధ్యం కాని పని. దశాబ్దాలుగా సరిహద్దు తగవులు అలాగే వున్నాయి.

**ముంపు ప్రాంతంలో రక్షిత అడవుల విస్తీర్ణం**

| క్రమ సంఖ్య | సర్కిల్ | డివిజన్ | రక్షిత అడవులు చ.కి.మీ.) |
|---|---|---|---|
| 1. | ఖమ్మం | (1) భద్రాచలం (ఉత్తరం) | 333.70 |
| | | (2) భద్రాచలం (దక్షిణం) | 479.53 |

| | | | |
|---|---|---|---|
| 2. | రాజమండ్రి | (1) కాకినాడ (తూ.గో.) | 531.13 |
| | | (2) ఏలూరు (ప.గో.) | 42.96 |

**గమనిక :** (i) ముంపు గ్రామాలలోని రక్షిత అడవుల విస్తీర్ణం ప్రత్యేకంగా దొరకలేదు. అందువల్ల సంబంధిత డివిజన్ వివరాలు పైన చూపబడ్డాయి.

(ii) రక్షిత అడవుల నిర్వహణ రిజర్వు అడవులతో సమాన స్థాయిలోనే ఉంటుంది.

హక్కులు నిర్ణయించకపోగా గిరిజనులు, సాంప్రదాయక అటవీవాసులపై వేధింపులు ఎక్కువ అయ్యాయి. దేశవ్యాప్తంగా ఇదే ధోరణి నెలకొనడంతో అటవీ నివాసుల్లో ఆందోళన ఎక్కువ అయింది. అదే సమయంలో గిరిజనులు, ఇతర అటవీ నివాసుల సహకారం లేకుండా అడవిని కాపాడటం అటవీ శాఖకు సాధ్యం కాదని నిర్ణయించుకుని 1988లో జాతీయ అటవీ పాలసీని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. గిరిజనుల జీవితం, అటవీ రక్షణ ఒకదానితో మరొకటి ముడిపడి వుండటం వల్ల గిరిజనుల భాగస్వామ్యంతో అడవి రక్షణ అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సమీప అడవి రక్షణలో పాల్గొనే సమాజాలకు లాభాలతో వాటాలు ఇవ్వాలని కూడా నిర్ణయించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 1990లో ఉమ్మడి అటవీ యాజమాన్యానికి నాంది పలికింది.

1993లో రాష్ట్ర అటవీ పాలసీని ప్రకటించింది. వన సంరక్షణ సమితిలు ఏర్పాటుచేసి వారికే సమీప అడవిని కాపాడే బాధ్యత అప్పజెప్పారు. తరువాత సామాజిక అటవీ యాజమాన్యంగా పిలవటం ప్రారంభించారు. పేరు ఏదైనా గిరిజనులను 'అడవిలో చొరబాటుదార్లు' అనే భావన నుంచి 'భాగస్వాములు' అనే భావన అధికారికంగా రావటంతో కొంత మార్పు వచ్చింది పై స్థాయి అధికారుల్లో. అయితే గ్రామ స్థాయి, మండల స్థాయి అధికారుల్లో మాత్రం తమ ఎస్టేట్ అధికారాలు పోతున్నాయేమోననే భావన అధికమైంది. **కాగితాల్లో, మాటల్లో ఉమ్మడి యాజమాన్యం చేతల్లో అధికారుల పెత్తనం కొనసాగింది.** తాము కాపాడిన అడవుల్లో ముఖ్యంగా వెదురు అడవుల్లో వచ్చే లాభాల్లో తమ వన సంరక్షణ సమితుల బ్యాంకు ఎకౌంట్ల్లో కొంత ధనం చేకూరడటంతో గిరిజనుల్లో ధైర్యం, ఉత్సాహం వచ్చింది. కాని ఆ ధనంలో సగభాగం మళ్ళీ అటవీ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాలని చెప్పేటప్పటికి నీరసబడ్డారు. పోనీ మిగిలిందైనా పంచుతారా అంటే దానికి అధికారులు సవాలక్ష లింకులు పెట్టారు. దాంతో డబ్బు కాగితాల మీదే మిగిలింది. సేకరించిన చిన్న తరహా అటవీ సంపద

నాణ్యత పెంచే కార్యక్రమాలు ఎంతో ఆర్భాటంగా మొదలై అంతలోనే ఆవిరి అయ్యాయి. అదే జీవనాధారంగా భావించిన యువత నిరుత్సాహపడ్డారు. కాపాడిన అడవుల్లోంచి వచ్చే ఫలసాయాన్నుంచి లాభాలు ఎప్పటికైనా వస్తాయని ఆశతో వున్న గిరిజనులకు ఆ అడవి అంతా మునిగిపోతుందని తెలియగానే మరింత డీలాపడ్డారు.

'డౌన్ టు ఎర్త్' అనే మాసపత్రిక (మే 15, 2011)లో రిచర్డు మహాపాత్రా గారి రాసిన "పోలవరం – మోసం" అనే వ్యాసంలో ఎంతోమంది గిరిజనులతో ఆయన చేసిన ఇలాంటి సంఘటనలను యధాతథంగా వివరించారు. మరొక విచిత్రం ఏమంటే పోలవరం ప్రాజెక్టు ప్రారంభం అవుతుందని 2005లో ప్రకటించినప్పటి నుండి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు ఈ గ్రామాలలో ఆపివేశారు. ఇప్పటికి పది సంవత్సరాల బట్టి రేషన్లు ఇవ్వటం ఉపాధి హామీ పథకాలు లాంటి సామాన్య పథకాలు తప్పించి ఏమి జరగట్లేదని గిరిజనుల ఆరోపణ. వన సంరక్షణ సమితులు పనిచేయడం మానేశాయి.

గిరిజన ప్రాంతాలలో అసంతృప్తి తగ్గకపోవడం వల్ల 2005లో ఎన్నిక కాబడిన యు.పి.ఎ. ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం తేవాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికి వామపక్షాల పట్టుదలే కారణం అనేది అందరూ అంగీకరించవలసిందే. అటవీ హక్కుల చట్టం 2006లో వచ్చింది.

**(డి) అటవీ హక్కుల చట్టం, 2006 సక్రమంగా అమలు కాలేదు**

200 సంవత్సరాలుగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న అటవీ హక్కుల చట్టం అమలు కూడా నీరుకార్చేరు అధికారులు. అసలు గిరిజనులకు వారి హక్కులను పునరుద్ధరణ చేసే కార్యక్రమం సాగనీయకుండా చేసే మనస్తత్వమే దీనికి కారణం అనిపిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని ఒక వలస ప్రాంతంగా చూస్తుంటే, స్వతంత్ర భారతదేశంలో షెడ్యూలు ప్రాంతాలను మరో వలస ప్రాంతాలుగా పరిపాలన సాగుతోందా అనిపిస్తుంది. అక్కడి వనరులు, ముఖ్యంగా అడవి, నీరు, భూమి, ఖనిజాల దోపిడీకి దారితీసే పథక రూపకల్పనలు కూడా ఇందుకు నిదర్శనం.

షెడ్యూలు తెగల, ఇతర సాంప్రదాయిక అటవీ నివాసుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2006లో ప్రకటించిన ఆశయాలు, నిర్ణయాలు చాలా మంచివే. ఇది రావడానికి ముందు 2002లో ఒక సంఘటన జరిగింది. ఒక ప్రక్కన 1988 అటవీ పాలసీ ప్రకారం ప్రజలను భాగస్వాములను చేయాలని చెబుతూనే, కేంద్ర ప్రభుత్వం 2002లో అడవుల్లో నివసించే గిరిజనులను ఆక్రమణదారులుగా / చొరబాటుదారులుగా పేర్కొంటూ వారిని వెళ్ళగొట్టాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో చాలా ప్రాంతాలలో ఉద్యమాలు వచ్చాయి. 2006లో అటవీ

హక్కుల చట్టం రావడంతో కొంత సద్దు మణిగింది. వివరాలు చదవండి.

"వలసపాలనలో గాని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గాని ప్రకటించిన రిజర్వు అడవుల్లో పూర్వీకుల కాలం నుంచి నివాసం ఉన్న గ్రామాలు, భూముల మీద గిరిజనులకు, సాంప్రదాయకంగా అడవుల్లో నివసించేవారి హక్కులను గుర్తించకపోవడం అనే చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దడమే యీ చట్ట లక్ష్యము" అని చట్టంలో నాంది పలకడం హర్షించదగ్గదే. ఈ లక్ష్య సాధనకై తరతరాలుగా అడవుల్లో నివసించే గిరిజనులు, సాంప్రదాయకంగా నివసిస్తున్న ఇతరుల హక్కులను గుర్తించి, వారికి అవి సంక్రమించేలా రికార్డులు తయారు చేయడం లాంటి ప్రక్రియలు చేపట్టాలని పేర్కొంది. (హక్కుల వివరాలకై చట్టం చదవండి లేదా నేను రాసిన "రాష్ట్రంలో గిరిజనులు – సమస్యలు", ప్రజాశక్తి బుక్‌హౌస్, 2014లోని 'అటవీ హక్కుల సమస్య' అనే వ్యాసం చదవండి). ముఖ్యాంశాలు ఇక్కడ పేర్కొంటాను.

**అటవీ హక్కులు రెండు రకాలు :** (i) వ్యక్తిగత హక్కులు (ii) సామాజిక హక్కులు. డిసెంబర్ 13, 2005 నాటికి ఆయా భూములు, ఆవాసాలు వారి ఆక్రమణలో ఉండాలి. అర్హత నిర్ణయం (ఎంతవరకు, ఎలాంటిది) ప్రాథమికంగా గ్రామసభతో ప్రారంభం అవుతుంది. గ్రామసభ ఆమోదించిన వివరాలు సబ్ డివిజన్ స్థాయి కమిటీకి వెళ్తుంది. అక్కడ ఆమోదం పొందినవి జిల్లా స్థాయి కమిటీకి వెళ్తుంది. అక్కడ ఆమోదం పొందిన వాటికి పట్టాలు ఇవ్వాలి. హక్కుల నిర్ణయం పూర్తి అయ్యేవరకు ఎవరినీ ఆక్రమణ నుంచి తొలగించరాదు. అయితే చట్టం సక్రమంగా హక్కులు నిర్ణయం కాకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయి.

(i) 2009 ఎన్నికలలోపు పట్టాలు పంచుదామని అప్పటి ప్రభుత్వం నిర్ణయం, అతి తక్కువ సమయంలో అమలు జరిపిన హడావుడి ప్రణాళిక, ప్రగతి రిపోర్టులే ప్రాధాన్యంగా భావించిన అమలు విధానం వల్ల ఎన్నో అవకతవకలు జరిగాయి.

(ii) చట్ట ప్రకారం గ్రామసభలు అన్ని ఆవాసాలలోనూ జరపాలి. ముఖ్యంగా అడవికి దగ్గర ఉండే ఆవాసాలు (హేమ్లెట్లు)లో అటవీ హక్కుల సమస్య ఎక్కువగా వుంటుంది. ఇటువంటి చాలా వాటిల్లో గ్రామ సభలు జరుపలేదు. పంచాయతీ కేంద్రంలో జరిపిన గ్రామసభలలో ఆవాసాల జనాభా పాల్గొనలేదు. వారి సమస్యలు అలాగే వున్నాయి.

(iii) గ్రామ సభలు జరిగిన ప్రదేశాలలో గ్రామ పంచాయతీ అధ్యక్షులకు చట్టంపై అవగాహన లేదు. చట్టప్రకారం గ్రామ సభ నిర్వహణకు సహకరించవలసిన అధికారులే గ్రామ సభలను నిర్వహించారు. వారికి వీలైనప్పుడు, ప్రభుత్వానికి 'ప్రగతి రిపోర్టులు' పంపే విధంగా గ్రామసభలు జరిగాయని సర్వత్రా అంగీకరించిందే. చాలామంది అధికారులకే చట్టంపై

అవగాహన లేదు. దానికితోడు గ్రామ స్థాయి అటవీ అధికారులు శల్య సారధ్యం వహించడం కూడా తోడైంది. తమకు అవగాహన లేని చట్టం అమలుకు, గిరిజనులు అధికారుల సలహాల మీద ఆధారపడ్డారు. సంధానకర్తలైన గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు అవగాహన తక్కువ. అడవిలో పట్టాలు ఇవ్వాలని సిఫార్సు చేస్తే జైలు పాలవుతారని సర్పంచ్‌లను అటవీ అధికారులు భయపెట్టిన సందర్భాలు చాలా విన్నాను. అప్పటి వరకు అటవీ సంబంధిత కేసులతో విసిగిపోయిన సర్పంచ్‌లు గిరిజనుల దరఖాస్తులను తిరస్కరించేందుకే మొగ్గు చూపారు.

(iv) పట్టాలు పొందాలంటే గిరిజనులు డిసెంబర్ 13, 2005 నాటికి అక్కడ నివాసులు అయితే చాలు. కాని సాంప్రదాయక అటవీ నివాసులకు మాత్రం మూడు తరాలు (అంటే 75 సంవత్సరాలు) పాటు అక్కడ నివసిస్తున్నట్లు ఆధారాలు చూపాలి. అడవి గ్రామాలలో ఏం రికార్డులు ఉంటాయి. అటవీ శాఖ వేసే చలానులు కూడా లేవు. ఎందుకంటే వారు లంచాలు తీసుకుని కాలక్షేపం చేసిన సందర్భాలే ఎక్కువ. 1986 వరకు ప్రాథమిక పాఠశాలలే లేవు చాలా గ్రామాల్లో. ఏజెన్సీ ప్రాంతంలో భూములు సర్వే చేయాలనే చట్టం 1970 నుండి వచ్చినా పనిమాత్రం 1986 గ్రామీణ మాగాణ సమారాధన వచ్చినప్పటి నుంచే మొదలైంది. ఇక జనాభా లెక్కలు, ఓటర్ల లిస్టులు లాంటివి ఎక్కువకాలం వుండవు. చాలామంది పేర్లు వాటిలో ఉండవన్నది అందరికీ తెలిసిందే. దాంట్లో 75 సంవత్సరాల రికార్డు ఎక్కడుంది ఏజెన్సీలో. ఇదీకాక ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు అటవీ పట్టాలు ఇవ్వొచ్చా లేదా అనే మీమాంస ఉండనే ఉంది. చివరకు దరఖాస్తుల తిరస్కరణే మంచి మార్గమని ఎంచుకున్న సందర్భాలు చాలా వున్నాయి.

(v) సామాజిక హక్కుల వరకు వస్తే సంధానకర్తలైన గ్రామస్థాయి గిరిజన సంక్షేమ అధికారులకే అవగాహన లేదు. గ్రామ సభలలో అధికారికంగా సంధానం చేయవలసిన వాళ్ళు హాస్టల్ వార్డెన్ స్థాయి ఉద్యోగులు. పిల్లలకు భోజనం, పుస్తకాలు, బట్టలు సమకూర్చడంలోనే వారికి పరిజ్ఞానం ఉంది. ఇక గ్రామీణాభివృద్ధి శాఖ (ఇందిరా క్రాంతి పథకం) వారి గ్రామస్థాయి అధికారుల్లో చాలామంది చదువు మధ్యలో మానేసిన గిరిజన యువకులే. వారం రోజుల అవగాహనా శిక్షణలో వారు నేర్చుకున్నది చాలా తక్కువ. చిత్తశుద్ధి వున్నా ఆచరణలో ప్రభుత్వ అధికారులపై ఆధారపడవలసి వచ్చింది. చాలా సందర్భాలలో లంచం ఇచ్చిన వారికి పట్టాలు, ఇవ్వని (ఇవ్వలేని) వారికి తిప్పలు సామాన్యం అయింది.

(vi) సామాజిక హక్కులు చాలా విస్తృతమైనప్పటికీ చిన్న తరహా అటవీ ఫలసాయం మీద హక్కులకే ప్రాధాన్యత పెరిగింది. చట్టపరంగా ఇవి గ్రామసభకు చెందాల్సి వుండగా వన సంరక్షణ సమితులకు సంక్రమింపచేయడం జరిగింది. ఇది చట్ట విరుద్ధం అని వాదిస్తున్నారు

చాలామంది. నా అభిప్రాయం భిన్నంగా వుంది. గ్రామ పంచాయతీ అధికారాల ప్రకారం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకునేందుకు వారికి అధికారం ఉంది. వన సంరక్షణ సమితులు అటువంటి కమిటీగా గుర్తిస్తే సరిపోయేదేమోనని నా అభిప్రాయం. అటవీ శాఖకు కూడా యీ విషయంలో ఒక అధికారిక సూచన ఇచ్చా. మరొక విషయం కూడా ఆలోచించాలి. అది గిరిజనేతరులు అధికంగా ఉండే గ్రామసభ స్వరూపం గురించి. అక్కడ మోసానికే అవకాశం ఎక్కువ. దీనిపై 'పీసా చట్టం' గురించి చర్చిస్తున్నప్పుడు వివరిస్తా.

(vii) చట్టంలో అర్హత తేదీ ఉంది కాని అమలుకు కాల పరిమితి లేదు. కాని చట్టం అమలు త్వరితగతిని చెయ్యాలనే ఉద్దేశంతో ఆరు నెలల్లో పని పూర్తి చేయాలి అని చెప్పారు. ఆరు నెలల తరువాత పని ఆపేసిన సందర్భాలు కూడా వున్నాయి.

(viii) కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం అన్ని ఆవాసాలలోనూ గ్రామ సభలు నిర్వహించాలి. అలాగే ఏ కారణం లేకుండా తిరస్కరించిన దరఖాస్తులు కూడా పునఃపరిశీలించాలి. రాష్ట్ర విభజన హడావుడిలో యీ కార్యక్రమం వెనుకబడింది. ఇప్పుడైనా చేపట్టాలి.

(ix) అదృష్టవశాత్తు పట్టాలు వచ్చిన వాళ్ళలో కొన్నిటిలో చాలామందికి పేరు ఒకళ్ళది, ఫోటోలు మరొకరివి; అన్నీ బాగుంటే అధికారులందరి సంతకాలు లేనివి కొన్ని. సంతకాలు ఉన్నా, సంతకాల క్రింద స్టాంపు వెయ్యలేదు కాబట్టి పట్టా చెల్లదని చెప్పాడు ఒక అటవీ అధికారి. మడగూడెం (గ్రా), కొత్తగూడెం (మం), వరంగల్ జిల్లాలో ఇలా ఉంది వ్యవహారం.

(x) గ్రామంలో రెవెన్యూ భూమి, అటవీ భూమి అనేవి రెండే ఉంటాయి. రెవెన్యూ భూమిలో ప్రభుత్వ భూమి, ప్రైవేట్ భూమి ఉంటాయి. అయితే అటవీ హక్కుల చట్టం క్రింద ఇచ్చిన వ్యక్తిగత పట్టాలు రెవెన్యూ రికార్డు (పహాణి / అడంగల్)లో ఉండాలా, అటవీ శాఖ మ్యాపుల్లో ఉండాలా అనేది పెద్ద సందేహం వచ్చింది. అటవీ హక్కులు, వ్యక్తులు అనుభవించడానికి, వారసత్వానికి మాత్రమే అని వుంది. భూమి రిజర్వు అడవిగానే పరిగణించబడుతుంది. అందువల్ల మధ్యేమార్గంగా తాసిల్దారు కార్యాలయంలో అటవీ హక్కుల నమోదుకు ప్రత్యేక రికార్డులు పెట్టారు. గ్రామ రెవెన్యూ రికార్డుల కంప్యూటరీకరణలో యీ ప్రత్యేక రికార్డులను వదలి వేశారు. అటవీ రికార్డుల్లోనూ వివరాలు నమోదు కాలేదు. త్రిశంకు స్వర్గంలాగ అయింది పరిస్థితి. కొన్ని కుటుంబాలలో అయితే తండ్రికి చెందిన అటవీ భూముల్ని కాలక్రమేణా పెండ్లయిన పిల్లలు పంచుకున్నారు కూడా. పట్టా మాత్రం పెద్దాయన పేరు మీదే ఉంది. కొందరు చనిపోయారు కూడా. రికార్డులు అస్తవ్యస్తం. అంతా గందరగోళం.

**వ్యక్తిగత పట్టాల వివరాలు (30-10-2013)**

**(ఆధారం : గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్)**

| క్రమ సంఖ్య | వివరాలు | తూర్పు గోదావరి జిల్లా | పశ్చిమ గోదావరి జిల్లా | ఖమ్మం జిల్లా |
|---|---|---|---|---|
| 1. | ఎ. దరఖాస్తులు (సంఖ్య) | 20,746 | 6,909 | 1,01,200 |
| | బి. విస్తీర్ణం (ఎకరాలు) | 52,394 | 17,926 | 4,24,557 |
| 2. | ఎ. పట్టాలు పంచినవి (సంఖ్య) | 7,900 | 1,189 | 31,961 |
| | బి. విస్తీర్ణం (ఎకరాలు | 30,129 | 2645 | 1,14,082 |
| 3. | ఎ. తిరస్కరించినవి (సంఖ్య) | 12,032 | 4,640 | 35,230 |
| | బి. విస్తీర్ణం (ఎకరాలు) | 21,157 | 10,081 | 1,72,756 |

ఆమోదించిన వాటి కంటే తిరస్కరించిన దరఖాస్తులే ఎక్కువ. దరఖాస్తు చేసుకునే అవకాశం లేనివారు, తిరస్కరణకు గురైన వారిని కూడా కలిపితే చాలా శాతం మందే ఉంటారు. మొత్తం మీద పరిష్కరించిన సమస్యలకంటే పరిష్కారం కానివే ఎక్కువగా ఉన్నాయి.

**చిన్న తరహా అటవీ ఫలసాయం వ్యాపారంలోనూ మోసమే**

చిన్న తరహా అటవీ ఫలసాయం (ఎం.ఎఫ్.సి.) గురించి మూడు చట్టాలలో ఉంది. ఒక ప్రభుత్వ ఉత్తర్వులోనూ ఉంది. అడవిలోనూ / అడవికి దగ్గరలో నివసించే గిరిజనుల జీవితాలు అడవితో ముడిపడతాయి అన్నది ఇంతకుముందే చర్చించా. అయితే వారు సేకరించిన చిన్న తరహా అటవీ ఫలసాయం వారం వారం జరిగే సంతలలో అమ్మేవారు. పప్పులు, ఉప్పులు, మసాలాలు, ఉప్పుచేపలు, బట్టలు, గాజులు లాంటివి అప్పుగా ఇచ్చిన షావుకారు సంతకు మొదట్లోనే కూర్చుని గిరిజనుల దగ్గర నుండి యీ అటవీ ఫలసాయాన్ని సేకరిస్తారు. ఇచ్చిన అప్పు, వడ్డీ లాంటివి మినహాయించుకుని మిగిలిన (నిజంగా మిగిలితే) డబ్బులు ఇస్తారు. లేకపోతే తమ దగ్గరే సామానులు కొనుక్కోమంటారు. వస్తు మార్పిడే ఎక్కువగా ఉండేది. దీంట్లో చాలా దోపిడీ ఉందని గ్రహించిన అప్పటి మద్రాసు ప్రభుత్వం మలయప్పన్ కమిటీని 1950లో నియమించింది. వారు అన్ని ఏజెన్సీ ప్రాంతాలు తిరిగి ఒక పెద్ద రిపోర్టు ఇచ్చారు. చాలా విషయాలలో ఇది ఇప్పటికీ ప్రామాణికమే. చాలా అభివృద్ధి పథకాలకు సూచనలు

చేశారు. వాటిలో ముఖ్యమైనది గిరిజనులను వడ్డీ వ్యాపారుల నుండి కాపాడి, వారు సేకరించే చిన్న తరహా అటవీ ఫలసాయానికి సరైన ధర ఇచ్చే యంత్రాంగం స్థాపించాలని, యీ సూచన ఆధారంగా నెలకొల్పబడిందే జి.సి.సి. (గిరిజన సహకార సంస్థ). అప్పట్లో వేరే పేరు ఉండేది. గిరిజన సహకార సంస్థ రెండు పనులు చెయ్యాలి. (1) గిరిజనుల దగ్గర నుండి చిన్న తరహా అటవీ ఫలసాయాన్ని సేకరించాలి (2) వారికి కావలసిన నిత్యావసర వస్తువులను వారి గ్రామాల దగ్గరనే సరఫరా చేసే డిపోలను నెలకొల్పాలి. అయితే షావుకారు, గిరిజనుడి మధ్య ఉండే సంబంధం సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్ల జి.సి.సి. నెలకొల్పగానే దోపిడీ ఆగిపోతుందని ఊహించారు.

షావుకారు 'అవసర కాలంలో ఆదుకునే స్నేహితుడు' అనేది సత్యం. గిరిజనుల బలహీనతను ఆసరా చేసుకుని అతడు దోపిడీ చేస్తున్నాడనేది కూడా సత్యమే. ఇదొక విషవలయం. గిరిజనుల అవసరాలు చిన్నవే. వ్యవసాయ రుణాలు, పుట్టుక, పెండ్లి, అనారోగ్యం, చావులాంటి సందర్భాలలో అయ్యే ఖర్చులకు షావుకారు రుణాలు ఇస్తాడు. ఇది వస్తు రూపేణా లేక ధనం రూపేణా ఇస్తాడు. ఇచ్చినది కాగితం మీద రాసి, వేలిముద్రలు తీసుకుంటాడు. ఊర్లో పెద్దమనుష్యులు సాక్ష్యంగా ఉంటారు. దేవుళ్ళ మీద ఒట్టు వేయించుకుంటాడు. అసలు కాగితం మీద రాసినది చదివే అక్షర జ్ఞానం యీ మధ్య వరకు లేదు గిరిజనులకు. ఈ మధ్యనే కొంతమంది చదువుకునేవారు వచ్చినా దరిద్రం వారిని నిస్సహాయులుగా చేస్తుంది. ఇక ప్రభుత్వ బ్యాంకుల సంగతి అందరికీ తెలిసిందే. పెద్ద పెద్ద వ్యాపారులకు కోట్ల రూపాయలు అప్పు ఇచ్చేందుకు ఎంతో ఉత్సాహం చూపిస్తారు. తనఖా పెట్టిన ఆస్తులు నిజమైనవి కాదని, అప్పు ఎగ్గొట్టిన తరువాతే తెలుసుకుంటారు. వీటిని 'నిరర్ధక ఆస్తులు' అని పిలుస్తారు. వ్యాపారికి లాభాలు వస్తాయి. వ్యాపారం నష్టాలలో నడుస్తుంది. ఇదొక అంకెల గారడి. అయితే నిత్యం నిజాయితీగా వుండే గిరిజనుడికి చిన్న చిన్న అప్పులు ఇచ్చేందుకు ఈ మధ్య వరకూ బ్యాంకుల వద్ద పథకమే లేదు. కొన్నాళ్ళు గ్రామ సంఘాల ద్వారా అప్పులిచ్చే పథకం ఉండేది. అది కూడా ఇప్పుడు నిరర్ధక ఆస్తిలాగే అయింది. ఇక బతకాలంటే షావుకారు మీద ఆధారపడక తప్పలేదు.

దేశమే ప్రపంచబ్యాంకు, వాటి సంస్థల దగ్గర నుంచి అప్పులు చేసి ఇరుక్కుంటే, సామాన్యులైన గిరిజనులు షావుకార్ల వల నుండి ఎలా తప్పుకోగలరు. వ్యాపారంలోను, దోపిడీ పద్ధతుల్లోనూ యీ రెండు వ్యవస్థల్లోనూ తేడా లేదు. ప్రపంచ బ్యాంకు దగ్గరకు అధికారులు సూటు, బూటుతో వెళ్తే, గిరిజనుడి చిరిగిన బట్టలతో షావుకారు దగ్గరకు వెళ్తాడు. ప్రపంచబ్యాంకు దగ్గర అప్పు తీసుకుంటే కంప్యూటర్ లాంటివన్నీ వారు చెప్పిన సంస్థల నుంచే కొనాలి. గ్రామ

స్థాయి షావుకారు కూడా అంతే. వాని దుకాణంలోనే అన్ని వస్తువులు కొనాలి, అమ్మాలి. అప్పుల ఊబిలో ఇరుక్కొన్న తరువాత బయటపడే ప్రసక్తే లేదు ఈ రెండు సందర్భాలలోను.

ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపారం నుంచి ప్రైవేట్ షావుకార్లను తప్పించేందుకు జి.సి.సి.కి మోనోపలీ (సర్వాధికారం) హక్కును 1979లో ఒక రెగ్యులేషన్ ద్వారా ఇచ్చారు. ప్రభుత్వ ఏజెంట్‌గా ప్రభుత్వం ప్రకటించిన చిన్న తరహా అటవీ ఫలసాయం వ్యాపారంలో ఏకైక సేకరణ హక్కులు జి.సి.సి.కి ఇవ్వబడ్డాయి. గిరిజనులకు సహాయం చేద్దామని ప్రభుత్వం మంచి ఉద్దేశంతో యీ రెగ్యులేషన్‌ను తీసుకువస్తే, జి.సి.సి.లో క్రింది స్థాయి ఉద్యోగులు జి.సి.సి.ను ఏకైక దోపిడీ వ్యవస్థగా మార్చారని గిరిజన నాయకులు పేర్కొన్న సందర్భాలు 1971 నుండి చాలాసార్లు విన్నాను. తూకాల్లో మోసం, ధర నిర్ణయంలో మోసం, నాణ్యత విషయంలో అవకతవకలు సర్వసాధారణం అయితే వారి మీద క్రమశిక్షణా చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా కోకొల్లలు. ఇదికాక సంస్థాగతమైన లోపాలు కూడా వున్నాయి.

జి.సి.సి.లో పనిచేసే వారి జీతభత్యాలు పూర్తిగా ప్రభుత్వమే భరించేది ఇంతకుముందు. దీనికి ప్రత్యేక కారణం ఉంది. గిరిజనులకు ఇచ్చే కొనుగోలు ధర నిర్ణయం మీద జీతభత్యాల భారం పడకుండా వారికి వీలైనంత లాభం గిరిజనులకు చేకూర్చాలని ప్రభుత్వ ఉద్దేశం. కాలక్రమేణా జీతాలు పెరిగాయి, ప్రభుత్వం పై భారం కూడా పెరిగింది. ఈ లోపల ప్రపంచ బ్యాంకు రుణాలు, సరళీకృత విధానం మన ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ నిర్ణయాలు మీద కూడా పడింది. జి.సి.సి.ను సంక్షేమ వ్యవస్థగా చూడకుండా వ్యాపార సంస్థగా పరిగణించారు. "మీ సంస్థ నిర్వహణ అదనపు ఖర్చులు మీ లాభాల నుంచే సంపాదించుకోవాలి" అని నిర్ణయాలు తీసుకున్నారు. దాంతో జి.సి.సి.కి వ్యాపార దృష్టి పెరిగింది. బయటి మార్కెట్‌లో లాభాలు తెచ్చిపెట్టే వస్తువులనే సేకరించడం ప్రారంభించారు. దాంతో చిన్న చిన్న వస్తువులు సేకరించే వారు ఇబ్బందుల్లో పడ్డారు. షావుకార్లే సంత బయటకొని, గిరిజనుల పేర్ల మీద సేకరణ డిపోల్లో అమ్మిన సందర్భాలు ఏ సంతకు వెళ్ళినా తెలుస్తాయి. సేకరణ ధరలు పెంచినా గిరిజనుల ఆర్థిక పరిస్థితిలో మార్పులు కనిపించలేదు. ఇదేకాకుండా సేకరణ ధర నిర్ణయించే పద్ధతిలోనే మార్పు వచ్చింది.

మొదట్లోనే బయటి మార్కెట్‌లో జి.సి.సి. హోల్‌సేల్‌గా అమ్మే ధర నిర్ణయిస్తారు. హోల్‌సేల్ షావుకార్లదే పై చేయి ఎప్పుడూ. ఈ ధరలోంచి రవాణా ఖర్చులు, ఎండు శాతం (డ్రయేజ్) తీసేస్తే ఇంక మిగిలింది ఏమిటి? దీనికి తోడు ప్రైవేట్ షావుకార్లు మొదట్లో ఎక్కువ రేట్లు చెప్పి తూకంలో మోసాలు చేస్తారు. అంతకుముందు ఇచ్చిన అప్పులకు వడ్డీలు లాంటివి చూపి కూడా మోసం చేస్తారు. ముందు గొయ్యి, వెనుక నుయ్యి అన్నట్లు అవుతోంది గిరిజనుల

పరిస్థితి.

చిన్న తరహా అటవీ ఫలసాయానికి నాణ్యత పెంచడానికి కొన్ని ప్రయత్నాలు కూడా జరిగాయి. జి.సి.సి. / అటవీ శాఖ ద్వారా గిరిజనులకు శిక్షణ ఇచ్చారు. జిగురు సేకరణలో నైపుణ్యం పెంచి వాటి నాణ్యత పెంచేందుకు, చెట్లు చనిపోకుండా జిగురు సేకరించే విధానం, అడ్డాకులతో విస్తర్లు (మెషీన్‌తో కంచాల రూపంలో) చేయించడం, తేనె నాణ్యత పెంచడం, వెదురుబద్దలతో అగరుబత్తీ పుల్లలు తయారీ లాంటివి చేశారు. కాని ఇవి ఎక్కువ కాలం నిలబడలేదు. అసలు గిరిజన సమాజంలోను, ఆర్థిక వ్యవస్థలోను వచ్చిన మార్పులను అర్థం చేసుకుని ప్రభుత్వ వ్యవస్థల పని తీరు మారాలి. అది జరగలేదు జి.సి.సి. విషయంలో.

చిన్న చిన్న అవసరాలకు గిరిజనులకు కావలసిన రుణాలు ప్రభుత్వ బ్యాంకులు పట్టించుకుపోగా జి.సి.సి. కూడా అంతగా స్పందించలేదు. అయితే గిరిజన సమాజంలో రెండు ముఖ్యమైన మార్పులు ఈ మధ్య వచ్చాయి. ఆశ్రమ పాఠశాల / హాస్టల్ చదువులు మధ్యలో మానేసిన వారు నూటికి ఎనభై మంది ఉన్నారు. వారిలో చాలామంది అడవి నుండి చిన్న తరహా అటవీ ఫలసాయాన్ని సేకరించడానికి ఇష్టపడరు. చిన్న వయస్సులో పాఠశాలలోనే ఉండటం వల్ల సేకరణకు కావలసిన నైపుణ్యం రాలేదు. ఎందుకంటే ఇది సాంప్రదాయకంగా వచ్చేది. అయితే సేకరించిన ఫలసాయానికి నాణ్యత పెంచే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎక్కువ శ్రద్ధ చూపసాగారు. కాని యీ కార్యక్రమాలు అమలు ఆరంభ శూరత్వంగానే మిగిలాయి. సేకరించిన చిన్న తరహా అటవీ ఫలసాయానికి నాణ్యత పెంచే నైపుణ్యం వృధాగానే ఉండిపోయింది. దాంతో షావుకార్ల ఇష్టారాజ్యం అయింది.

గిరిజన ఆర్థిక వ్యవస్థ గత 20 సంవత్సరాలలో సంచార వ్యవసాయం నుండి స్థిర వ్యవసాయం, వాణిజ్య పంటలు, పండ్ల తోటల పెంపకంలోకి మారింది. పోడు భూముల్లో పండ్ల తోటలు, జీడి మామిడి తోటలు, కాఫీ తోటలు వచ్చాయి. రంపచోడవరం ఏజెన్సీలో పండే జీడి మామిడి మీద లాభపడింది ఏలేశ్వరం, తుని షావుకార్లే ఎక్కువ. అలాగే గోదావరి గట్టు ప్రక్కన నివసించే కొండ రెడ్లు పొగాకు, మిర్చి లాంటి వాణిజ్య పంటలు పెంచడం నేను ఐదు దశాబ్దాల క్రితమే చూశాను. మరి ఇప్పటికీ బీదరికం పోలేదంటే కారణం. వారి వ్యవసాయ, పండ్ల తోటల ఉత్పత్తులకు సరైన ధరలు కల్పించే ప్రభుత్వ వ్యవస్థ లేకపోవడమే. సరళీకరణలో మార్కెట్ ఎప్పుడూ దోపిడీ వ్యవస్థ అనేది అందరికీ తెలిసిందే. పెద్ద పెద్ద రైతులే నీరు కారిపోతున్నప్పుడు, గిరిజన రైతులు ఎలాగ నిలబడగలుగుతారు? అనేది తీవ్రంగా చర్చించవలసిన సమస్య.

ముంపు గిరిజన ప్రాంతాలలో ముఖ్యంగా భద్రాచలం ప్రాంతంలో బీడి ఆకులు విస్తారంగా దొరుకుతాయి. భద్రాచలంలో దొరికే ఆకు నాణ్యత ఎక్కువ, ధర ఎక్కువ. అయితే వీటి వ్యాపారం అంతా అటవీ అధికారుల చెప్పుచేతల్లో ఉంటుంది. కళ్ళాలు (ఆకు సేకరించే ప్రదేశాలు) బీడి ఆకును ముందుగానే పాడుకున్న కాంట్రాక్టర్ల అధీనంలో ఉంటాయి. గిరిజనుల నుంచే సేకరించాలని పీసా చట్టం చెబుతోంది. కాని అమలులో లేదు. సేకరణ టార్గెట్ ముఖ్యం. గిరిజనులు ఎప్పుడూ నష్టపోతూనే వుంటారు. కళ్ళాలు మూసివేసిన తరువాత షావుకార్ల చేతుల్లోకి పోతుంది యీ వ్యాపారం. గిరిజన సేకరణదారుల నోట్లో మట్టే.

**పీసా చట్టం అమలు - ఒక ఎండమావి**

ఎప్పుడో బ్రిటిష్ కాలంలో కోల్పోయిన గిరిజన, స్వపరిపాలన వ్యవస్థ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా పునరుద్ధరణ జరగలేదు. సరికదా బ్రిటిష్ వాళ్ళు భారతదేశాన్ని తమ వలస రాజ్యంగా చూస్తే, స్వతంత్ర భారతదేశంలో గిరిజన ప్రాంతాలను వలస ప్రాంతాలుగా చూస్తున్నారని చాలా మంది వ్యాఖ్యానించారు. స్వతహాగా స్వాతంత్ర ప్రియులైన గిరిజనులు రెండు వందల సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే వున్నారు. పోరాటాల స్వరూపాలు మారినా స్వతంత్ర భారతదేశంలో కూడా గిరిజన పోరాటాలు కొనసాగాయి. ముఖ్యంగా 1960–2000 మధ్యలో ఇవి చాలా తీవ్ర రూపం దాల్చాయి. సాయుధ పోరాటాలుగా మారాయి. మొత్తం మధ్య భారతదేశ గిరిజన ప్రాంతాలు (ఐదవ షెడ్యూలు ప్రాంతాలు)లో యీ పోరాటాలు జరిగాయి. బ్రిటిష్ ప్రభుత్వం గిరిజన పోరాటాలను చిత్రీకరించినట్లే స్వతంత్ర భారత ప్రభుత్వాలు కూడా గిరిజనుల పోరాటాలు బయటివారి ప్రోత్సాహం వల్లే జరుగుతున్నట్లు అర్థం చేసుకున్నారు. తరతరాలుగా పరిష్కారంకాని సామాజిక / ఆర్థిక సమస్యగా కాకుండా రాజకీయ, శాంతి భద్రతల సమస్యగా అర్థం చేసుకున్నారు. ఈ ప్రాంతాలను కల్లోల ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేక పోలీసులను పంపించారు. క్యాంపులు పెట్టారు. అయితే 1992లో రాజ్యాంగం 73వ సవరణ చేసి పంచాయతీ రాజ్ చట్టం చేసేటప్పుడు మాత్రం, ఐదవ షెడ్యూలు ప్రాంతాలకు యీ చట్టంలో మార్పులు చేసిన తరువాతే వర్తింప చేయాలని నిర్ణయించారు. అధికార వికేంద్రీకరణ, స్థానిక పాలనలాంటి విషయాలతో పాటు గిరిజన స్వయం పరిపాలనా వ్యవస్థకు తగ్గట్టుగా మార్పు చేయాలని నిర్ణయించారు. 1994లో శ్రీ దిలీప్‌సింగ్ భూరియా అధ్యక్షతన ఒక కమిటీని నియమించి అవసరమైన సవరణలకు సూచనలు చేయవలసిందిగా కోరటం జరిగింది. 1996లో వచ్చిన కేంద్ర పీసా చట్టం (40వ యాక్టు 1996) వీరి రిపోర్టు పర్యవసానమే. కేంద్ర చట్టంను అనుసరించి ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (సవరణ) చట్టం,

1998 వచ్చింది. దీన్నే పీసా చట్టంగా వ్యవహరిస్తారు. పీసా చట్టం (Panchayati Raj Extension to Scheduled Area - PESA) షెడ్యూలు (ముంపు) ప్రాంతాలకు పూర్తిగా వర్తిస్తుంది.

దిలీప్ సింగ్ భూరియాగారి సలహాలన్నీ కేంద్ర చట్టంలో రాలేదని, కేంద్ర చట్టం ప్రకారం రాష్ట్ర చట్టం రాలేదని, రాష్ట్ర చట్టం 1998లో వస్తే 13 సంవత్సరాల తరువాత 2011లో రూల్సు వచ్చాయని, అంత లేటుగా వచ్చిన రూల్సు కూడా చట్ట వ్యతిరేకంగా వున్నాయని చాలా మంది వాపోయారు. ఈ రోజు కూడా షెడ్యూలు ప్రాంతంలో పంచాయతీలకు / మండళ్ళకు ఎన్నికైన గిరిజన ప్రజా ప్రతినిధుల్లో చాలామందికి పీసా చట్టంపై అవగాహన లేదు. పీసా చట్టంలోని కొన్ని ముఖ్యాంశాలు, వాటి అమలు పరిస్థితి ఇలాగ వున్నాయి.

(i) ఈ చట్టం రాష్ట్రంలోని షెడ్యూలు ప్రాంతాలన్నింటికి వర్తిస్తుంది.

(ii) ఈ చట్టంలోని అంశాలతో ఏదైనా ఇతర చట్టాలు విభేదిస్తే, పీసా చట్టానిదే పై చేయి (కాని ఆచరణలో అమలులో ఉన్న చట్టాలదే ఇప్పటికీ పై చేయి అవుతోంది).

(iii) పీసా గ్రామం అంటే గిరిజనుల ఆచారాల ప్రకారం గుర్తించబడి, వారే పాలన చేసుకునే ప్రాంతాలు. అంటే ప్రతి ఆవాసం / శివారు గ్రామాలు పీసా గ్రామాలుగా గుర్తించాలి. అయితే ఇంతకు ముందున్న పంచాయతీలే యధాతథంగా కొనసాగుతున్నాయి. దీంతో గ్రామసభ నిర్వహణ పంచాయతీ ముఖ్య గ్రామానికే పరిమితం అయింది. పంచాయతీలో భాగాలైన శివారు గ్రామాలు ఊహాజనిత గ్రామ సభలుగా మారాయి.

(iv) గిరిజనుల ఆచార వ్యవహారాలకు, సాంస్కృతిక ప్రత్యేకతకు అనుగుణంగా పరిపాలన సాగించేందుకు సౌకర్యం ఉంది. అయితే ప్రస్తుతం అమలులో వున్న చట్టాలకు వ్యతిరేకంగా అమలు చేస్తే కుదరదు అని కూడా ఉంది. మరి ఈ స్వపరిపాలనాధికారం దేనికో అర్థం కాదు. అదేగాక గిరిజన గ్రామ దేవతలందరి ఆవాసాలు మునిగిపోతాయి ఈ ప్రాజెక్టులో.

(v) గ్రామ ప్రణాళిక తయారీ, అమలు, పర్యవేక్షణ, లబ్దిదారుల ఎంపికకు గ్రామ సభలకు సర్వాధికారాలు ఉన్నాయి. అయితే వీటి అమలు అందరికీ తెలిసిందే. 'ఇష్టమైన' వారిని ఎంపిక చేసే విధానమే కొనసాగుతుంది. ఇక ప్రణాళిక తయారీ, అమలు లాంటివి అధికారుల చేతిలోనే వున్నాయి. సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలే.

(vi) సర్పంచ్, మండల అధ్యక్షులుగా గిరిజనులే ఉండాలి. అయితే చాలా మండలాలలో గిరిజనేతరులచే నియమించబడ్డ వారే ఎన్నికవడం చూస్తుంటాం. దీనికి తోడు ఎం.పి.టి.సి., జెడ్.పి.టి.సి. వ్యవస్థ మరొక అడ్డం. దాంట్లో సామాన్య రిజర్వేషన్లు వర్తిస్తాయి. సర్పంచ్,

మండలాధ్యక్ష వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఈ సమాంతర వ్యవస్థ మారేడుమిల్లి మండల్‌లో, ఒక మారుమూల పంచాయతీ ఎం.పి.టి.సి. పోస్టు బి.సి.లకు రిజర్వు చేస్తే అభ్యర్థి దొరక్క రంపచోడవరంలో నివసిస్తున్న ఒక బీద బి.సి.ని బలవంతంగా తీసుకువెళ్ళేరని, అక్కడ ఆయన బతకలేక తిరిగి వచ్చేశారని చాలామంది చెప్పగా విన్నాను. స్థానిక గిరిజన స్వపరిపాలనకు ఉద్దేశించిన పీసా చట్టం ప్రాంతంలో యీ సమాంతర వ్యవస్థను రద్దు చెయ్యాలి. లేకపోతే ఇటువంటి అపహాస్యాలు తప్పవు. ఇదేకాకుండా స్థానిక గిరిజనులే ఎన్నిక అయ్యేలాగ చట్టంలో మార్పులు చెయ్యాలి. లేకపోతే ఇప్పుడు రాష్ట్రంలో, ఇతర ప్రాంతంలో నివసించే గిరిజనులు వారి ఆర్థిక బలం ఉపయోగించి షెడ్యూలు ప్రాంతాలలో ఎన్నిక అయ్యేందుకు అవకాశం కలుగుతోంది.

(vii) షెడ్యూలు ప్రాంతాలలో భూసేకరణ, పునరావాసం విషయాలలో మండల పరిషత్ ఆమోదం తీసుకోవాలి. అది సంప్రదింపుల ద్వారా కూడా జరగలేదనే వాదన గట్టిగానే వినిపిస్తోంది.

(viii) షెడ్యూలు ప్రాంతంలో భూమి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు, అన్యాక్రాంతం అయిన భూమిని చట్టప్రకారం తిరిగి గిరిజనులకు ఇప్పించేందుకు గ్రామ సభకు అధికారం ఉందని చట్టంలో వుంటే, ఆ అధికారాలను నిర్వీర్యం చేసి వివరాలను సేకరించి అధికారులకు ఇచ్చే వ్యవస్థగా గ్రామసభను పేర్కొన్నారు రూల్సులో. ఎంత దురదృష్టకరం. ఈ చట్ట వ్యతిరేక రూల్సును కోర్టులో ప్రశ్నించాలి.

(ix) ఇక మార్కెట్‌పై అజమాయిషీ, మత్తు పదార్థాల / పానీయాల నిషేధం, వాటి వ్యాపారం క్రమబద్దీకరణకు కూడా గ్రామసభకు అధికారాలు వున్నాయి. అవి అమలు పరిచే అవగాహన, స్థోమత గిరిజన నాయకత్వానికి రాలేదు.

(x) చిన్న తరహా అటవీ ఫలసాయంపై ఆస్తి హక్కు గ్రామసభకు ఉంది. అయితే అటవీ హక్కుల చట్టం అమలులో చిన్న తరహా అటవీ ఫలసాయాన్ని వన సంరక్షణ సమితులకు ఇచ్చారు. వాటిలో వెదురు అటవీ శాఖ వారి ద్వారానే అమ్మాలి. అలాగే బీడీ ఆకులు అటవీ శాఖ నిర్ణయించిన కళ్ళాలలోనే అమ్మాలి. ఇతర ప్రకటిత చిన్న తరహా అటవీ ఫలసాయం జి.సి.సి.కే అమ్మాలి. గ్రామసభకు ఇంకెక్కడ హక్కు ఉంది?

(xi) చిన్న తరహా నీటి వనరుల ప్రణాళిక యాజమాన్యం, చిన్న తరహా ఖనిజాల అన్వేషణ లైసెన్స్ మంజూరీకి గ్రామ సభకు అధికారాలు వున్నాయి. ఈ అధికారాలు ఉపయోగించిన దాఖలాలు కూడా లేవు.

(xii) వడ్డీ వ్యాపారాన్ని నియంత్రించే హక్కు గ్రామ సభకు ఉంది. అయితే షావుకారు తప్పించి వేరే దిక్కులేని ఆర్థిక పరిస్థితుల్లో యీ నియంత్రణను ఎలా అమలు చేయగలుగుతారు?

(xiii) స్థానిక సంస్థలు, అధికారులపై అజమాయిషీకి గ్రామసభకు అధికారాలు వున్నాయి. అయితే అధికారులే సర్పంచ్‌లను శాసించే పరిస్థితి నెలకొంది ఇప్పుడు.

ఈ అధికారాలన్నింటినీ గ్రామసభలు నిర్వహించే పరిస్థితి నిజంగా ఉందా? అనేది అన్నిటి కంటే పెద్ద ప్రశ్న. ముంపులో వందల గ్రామాలు మాయమవుతుంటే గ్రామసభలు, వాటి అధికారాల గురించి మాట్లాడటం 'శవ పరీక్ష' లాంటిదేమోనని అనిపిస్తోంది. అధికారాల్ని బదలాయించడం ఇష్టంలేని వ్యవస్థలో కాలయాపన అనే అస్త్రంతో చట్టాన్ని నిర్వీర్యం చేశారనేది నిజం. గిరిజన నాయకత్వానికి చట్టంపై అవగాహనా లోపం వల్ల చట్టాన్ని దుర్వినియోగం చేసేందుకు కూడా అవకాశాలే ఎక్కువగా వున్నాయి ప్రస్తుతం.

తూర్పుగోదావరి ఏజెన్సీలో గిరిజన జనాభా సాంద్రత ఎక్కువ. కొన్ని రోడ్డు ప్రక్క గ్రామాలు తప్పించి సుదూర గ్రామాల్లో గిరిజనులే ఎక్కువగా వుంటారు. అలా కాకుండా పశ్చిమ గోదావరి ఏజెన్సీ, భద్రాచలం ఏజెన్సీలో గిరిజనేతరుల జనాభా ఎక్కువ. చాలాచోట్ల సగానికి పైగా వారే. గ్రామసభలో ఓటు హక్కు వున్న అందరూ సభ్యులే కాబట్టి గ్రామ సభ నిర్ణయాలలో వారిదే పై చేయి ఉంటుంది. అందుకని పీసా గ్రామ సభల్లో గిరిజన ఓటర్లకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని చట్టంలో మార్పులు చేస్తే బాగుంటుందని నా ఆలోచన.

**విద్యా హక్కు కూడా అంతే**

ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం గిరిజన అక్షరాస్యత (42.80%) దేశంలోని రాష్ట్రాలన్నిటికంటే అట్టడుగున ఉంది. రాష్ట్రం అక్షర క్రమంలో ముందున్నా అక్షరాస్యతలో ఆఖరుగా ఉండటం వల్ల, గిరిజన విద్యా కార్యక్రమాల అమలు వైఖరిని పరిశీలించవలసిన అవసరం వుంది. (వివరాలు తెలుసుకునే ఆసక్తి కలవారు "రాష్ట్రంలో గిరిజనులు – సమస్యలు" ప్రజాశక్తి బుక్‌హౌస్, 2014లో విద్యపై నేను రాసిన వ్యాసం చదవండి). ఇక్కడ ముంపు ప్రాంతాల సమస్య వరకే చర్చిస్తాను.

**ముంపు ప్రాంతాల జిల్లాల్లో గిరిజన అక్షరాస్యత (2011)**

| క్రమ సంఖ్య | జిల్లా | గిరిజన అక్షరాస్యత (2011) | | |
|---|---|---|---|---|
| | | **పురుషులు** | **స్త్రీలు** | **మొత్తం** |

| | | | | |
|---|---|---|---|---|
| 1. | తూర్పుగోదావరి | 52.53 | 43.01 | 47.67 |
| 2. | పశ్చిమ గోదావరి | 53.83 | 47.11 | 50.40 |
| 3. | ఖమ్మం | 52.97 | 39.01 | 45.91 |

**ఆయా జిల్లాల అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన అక్షరాస్యత ఎంత వెనుకబడి ఉందో తెలుస్తుంది.**

| క్రమ సంఖ్య | జిల్లా | అక్షరాస్యత (2011) | | |
|---|---|---|---|---|
| | | మొత్తం | గిరిజన | వ్యత్యాసం |
| 1. | తూర్పుగోదావరి | 71.35 | 47.67 | 23.68 |
| 2. | పశ్చిమ గోదావరి | 74.32 | 50.40 | 23.92 |
| 3. | ఖమ్మం | 65.46 | 45.91 | 19.55 |

గోదావరి జిల్లాలో మైదాన ప్రాంతాలకు, గిరిజన ప్రాంతాలకు ఆర్థికాభివృద్ధిలో కూడా వ్యత్యాసం చాలా వుంది. రాజమండ్రి ప్రాంతం కంప్యూటర్ యుగంలోకి ఎప్పుడో దూసుకువెళ్తే, రంపచోడవరం ఏజెన్సీలో నిరక్షరాస్యత తాండవిస్తోంది. డెల్టా ప్రాంతంలో గోదావరి బ్యారేజీ క్రింద మూడు పంటలు పండిస్తూంటే, రంపచోడవరం ఏజెన్సీలో అతి పురాతన వ్యవసాయమైన సంచార పోడు వ్యవసాయం, నిన్న మొన్నటి వరకూ చూసాము. ప్రతి సందులోనూ పది మంది డాక్టర్లు రాజమండ్రిలో ఉంటే, మండలానికి ఒక డాక్టరు కూడా దొరకని పరిస్థితి నెలకొని ఉంది ఏజెన్సీలో. విద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాలు, త్రాగునీరు లాంటివి ఎప్పుడూ సమస్యలే.

1975లో ఐ.టి.డి.ఎ.లు వచ్చిన తరువాత ఇప్పటికి 40 సంవత్సరాలలో ఎన్నో ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, హాస్టళ్ళు, కస్తూరిబా బాలికా విద్యాలయాలు స్థాపించారు. వీటిలో 2012-13లో సేకరించిన వివరాల ప్రకారం లక్షమంది పైగా చదువుకుంటున్నారు. ముంపు ప్రాంతంలో మాత్రం వారి చదువు ప్రశ్నార్థకం అయింది.

నమోదు వివరాలు ఇలాగ వున్నాయి.

| క్రమ సంఖ్య | జిల్లా | 1-10 క్లాసులందు నమోదైన గిరిజన విద్యార్థులు (2012-13) | | |
|---|---|---|---|---|
| | | **బాలురు** | **బాలికలు** | **మొత్తం** |
| 1. | తూర్పుగోదావరి | 19.637 | 20.286 | 39,923 |
| 2. | పశ్చిమ గోదావరి | 9,764 | 9,098 | 18,862 |
| 3. | ఖమ్మం జిల్లా | 71,255 | 71,134 | 1,42,389 |
| | మొత్తం | 1,00,656 | 1,00,518 | 2,01,174 |

**గమనిక :** 2,01,174 మంది విద్యార్థుల్లో లక్షకు పైగా ముంపు ప్రాంతంలో ఉంటారని అంచనా.

ముసిరిమిల్లిలాంటి మధ్య తరహా నీటి ప్రాజెక్టులో మునిగిపోయిన ఆశ్రమ పాఠశాల పునరావాసం ఎంత కష్టం అయిందో అందరికీ తెలిసిందే. వందల కోట్ల వ్యయంతో గ్రామాలకు దగ్గరగా కట్టిన పాఠశాలలు మునిగిపోతే ఎన్ని దశాబ్దాలకు మళ్ళీ తేరుకుంటారు వారు. అసలు తేరుకుంటారా ? లేదా? అనేది ఆలోచిస్తే భయం వేస్తుంది. ఇది ప్రాథమిక హక్కు అయిన విద్యా హక్కును హరించినట్టేగా? ఇది తీవ్రంగా చర్చించవలసిన విషయమే. గ్రామాలు మునిగిపోయే ముందు మరొక సమస్య వచ్చిపడింది.

ముంపు ప్రాంతంలో భద్రాచలం తప్పించి ఆ మండలంలోని మిగిలిన గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోయాయి. ఆ గ్రామాల నుంచి వచ్చి భద్రాచలంలో చదువుకునే పిల్లలు రాత్రికి రాత్రి పరాయి రాష్ట్రం వాళ్ళు అయ్యారు (నాన్ లోకల్). ఉద్యోగాలకు నాన్ లోకలే. ఇక వైద్యం అవసరం వస్తే భద్రాచలంలో చూస్తారో, రాజమండ్రికి వెళ్ళాలో తెలియదు.

అనాలోచితంగా అర్ధరాత్రి తీసుకున్న నిర్ణయాలతో గిరిజనుల జీవితాలతో ఎలాగ చెలగాటం ఆడుతున్నారో చూడండి. రాబోయే ఉపద్రవానికి సూచన మాత్రమే ఇది. ముంపు ప్రాంతాల పరిధిలో ఎన్నికైన రాష్ట్ర శాసనసభ్యుల నియోజకవర్గం రెండు ముక్కలు అయ్యింది. ఆంధ్రాకు వెళ్ళిన ప్రాంతం అక్కడి ఏ గిరిజన నియోజకవర్గంలో భాగం కాలేదు. ఓటర్లు అటువైపు, శాసనసభ్యులు ఇటువైపు ఏమి విచిత్రం. నిజంగా రాజకీయ సంక్షోభమే!

**అనారోగ్యం, అకాల మరణాలు**

ఏజెన్సీ ప్రాంతాలంటేనే అనారోగ్య ప్రాంతాలని ప్రభుత్వమే గుర్తించి ఎప్పటినుంచో బాడ్ క్లైమేట్ ఎలవెన్సులు ఇస్తోంది. మలేరియా, అతిసారం,  గొంతువాపు, క్షయలాంటివి ఎక్కువగా కనిపిస్తాయి. "భద్రాచలం నుండి రాజమండ్రికి మారేడుమిల్లికి మీదుగా ప్రయాణం చేస్తే దారిలోనే మలేరియా జ్వరం వస్తుంది" అని నేను చెబుతుంటే, మీరు మరీ విపరీతంగా చెబుతున్నారు సార్ అనేవారు మిత్రులు. కాని కొన్ని రోజులు  ఆ ప్రాంతాల్లో పర్యటించి / నివాసం ఉండి మలేరియా బారిన పడని వారు ఉంటే వారికి సన్మానం చేయొచ్చు అని నేనంటాను. పోషకాహార లోపం వల్ల ప్రజలు నిస్సత్తువగా కనిపించడం మామూలు అవుతోంది. కొండపోడు, చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం కొండలు రోజూ ఎక్కే కొండ రెడ్లు 'నేను ఓపనేను సార్' అనడం యీ మధ్యనే విన్నాను. అడవిలోకి వెళ్ళినప్పుడు అక్కడ దొరికే కందమూల ఫలాలు తిని, వాగు నీరు తాగి రెండు మూడు రోజులు కూడా ఆహారానికి ఇబ్బంది పడని గిరిజనులు యీ మధ్యన టిఫిన్ కారియర్, మంచినీళ్ళు పట్టుకుని అడవికి వెళ్ళడం కూడా చూశాను. పర్యావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రకృతి సిద్ధంగా దొరికే ఆహారం తగ్గిపోవడం, బయటి నుంచి వచ్చే ఆహారంలో పోషకాలు తక్కువ, ధర ఎక్కువ ఉండటం, మార్కెట్ దూరంగా ఉండటం వల్ల పోషకాహార లోపం పెరిగింది. నూటికి అరవై మందిలో పోషకాహార లోపం ఉందంటే దానివల్ల వచ్చే దుష్పరిణామాలు అర్ధం చేసుకోవచ్చు. అమ్మవారులాంటి చిన్న చిన్న జ్వరాలకు, అతిసార వల్ల చనిపోయే పిల్లలు గురించి అస్తమానం వార్తలు వస్తూనే వుంటాయి. తాటికల్లు, జీలుగుకల్లు స్థానంలో కల్తీ సారా తాగి చనిపోయినవాళ్ళూ ఎక్కువ అవుతున్నారు (వివరాలకు నేను రాసిన  'రాష్ట్రంలో గిరిజనులు – సమస్యలు' ప్రజాశక్తి బుక్‌హౌస్, 2014) చదవండి. ఇంతెందుకు  పై అధికారులకు, నాయకులకు నచ్చని అధికారులను 'శంకరగిరి మాన్యాలు' పట్టించడం ఇప్పటికీ మామూలే.

**భూసేకరణ, పునరావాస పాలసీలు, చట్టాలు**

అసలు గిరిజనులు నిర్వాసితులే కాకుండా, ఒక వేళ్ళ తప్పని పరిస్థితుల్లో నిర్వాసితులను

చేయవల్సివచ్చినా, అతి తక్కువ నిర్వాసితులు అయే ప్రాజెక్టు రూపకల్పనకు అవకాశం ఇప్పటికీ ఉందని చాలామంది నిపుణులు చెబుతారు. **ఒకరికి సహాయం చేయడం కోసం మరొకరిని ముంచే పాలసీ సంక్షేమ ప్రభుత్వ పాలసీ కాకూడదు** అని నేను నమ్ముతాను. అభివృద్ధి పేరుతో గిరిజనులను / గ్రామస్తులను నిర్వాసితులు చేయడం అనే ఆలోచనా విధానానికి యీ మధ్య ప్రభుత్వ రీత్యా మద్దతు ఎక్కువగా లభిస్తోంది అని చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న వరుస ఆర్డినెన్సులే తెలుపుతాయి. భూసేకరణకు సంబంధించిన ఆర్డినెన్సును కేంద్ర ప్రభుత్వం 31-05-2015న మూడవసారి జారీ చేశారు. బలవంతపు భూసేకరణ, నిరాశ్రయత రాబోయే రోజుల్లో తరచు చూస్తామనిపిస్తోంది. అందుకని చట్టం, పాలసీలు గురించి తెలుసుకుంటే ప్రశ్నించేందుకు వీలుంటుంది. అదే సమయంలో పోలవరం ప్రాజెక్టు విషయంలో ఇప్పుడు ఏం జరుగుతుందో కూడా పరిశీలిద్దాం.

**భూసేకరణ, పునరావాస చట్టం, 1894**

ఇంతకు ముందు అటవీ సమస్యలు చర్చిస్తున్నప్పుడు చెప్పినట్లు బ్రిటిష్ ప్రభుత్వం తమ వలస పాలనలో ఉన్న భూభాగంలోని స్థిరాస్తులన్నిటి మీద తమ అధికారం చెలాయించింది. ప్రభుత్వం ఎప్పుడైనా ఎక్కడైనా భూసేకరణ చెయ్యవచ్చు. ప్రభుత్వానికి ఆ సార్వభౌమ అధికారం (ఎమినెంట్ డొమైన్) ఉంది కాబట్టి భూసేకరణ చెయ్యవచ్చు అనేది బ్రిటిష్ వారి వాదన. దీనికి ప్రజావసరాలు (పబ్లిక్ పర్పస్) కోసం భూసేకరణ అనే సాకు చూపెట్టారు. 1894లో భూసేకరణ చట్టం జారీ చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా యీ చట్టానికి కొన్ని సవరణలు చేసినా, అసలు చట్టం మాత్రం అలాగే వుంది. చాలా సమస్యలు వచ్చాయి. భూసేకరణ వల్ల ప్రజల జీవనాధారమైన భూమిని సేకరణ చేసి, సరైన పరిహారం ఇవ్వకుండా వున్న సందర్భాలు కోకొల్లలు. అదే కాకుండా పెద్ద ఎత్తున భూసేకరణ చేసి ప్రజల్ని నిరాశ్రయుల్ని చేసిన సందర్భాలు కూడా చాలా వున్నాయి. సరైన పునరావాసం చేయకపోవడం వల్ల మరిన్ని ఇబ్బందులు కూడా వచ్చాయి. సేకరణ చేసిన భూమిని ఆయా అవసరాలకు ఉపయోగించారా? అంటే అదీ లేదు. సేకరించిన భూమిలో 60% నిరుపయోగంగా పడి ఉందని అందరూ అంగీకరించేదే. ఇదంతా ఎందుకు వచ్చిందంటే 1894లో వచ్చిన చట్టం (4.1) ప్రకారం జిల్లా కలెక్టర్‌కు అమితమైన అధికారాలు ఇవ్వబడ్డాయి.

ఏ ప్రాంతంలోనైనా భూమిని ప్రస్తుత అవసరానికి గాని, భవిష్యత్ అవసరానికి కాని ప్రజావసరాల కోసం అవసరం అనుకుంటే ఆ భూమిని సేకరించవచ్చు. అయితే ఆ భూమిపై ఆధారపడినవారికి నోటీసులు ఇచ్చి, వారి అభ్యంతరాలు సేకరించి, పరిహారం సకాలంలో చెల్లించి భూసేకరణ చేపట్టాలి. ఈ పద్ధతులన్నీ కాగితాలకే పరిమితమైన సందర్భాలు చాలా

ఉన్నాయి. ఎవరో కోర్టుల చుట్టూ తిరిగే ఆర్థిక స్థోమత, సమయం వున్నవాళ్ళు తప్పిస్తే మిగిలినవాళ్ళు చిన్నకారు, సన్నకారు రైతులు నష్టపోయిందే ఎక్కువ. దళారీల దోపిడీకి గురైన సందర్భాలు కూడా చాలా వున్నాయి. అటవీ / గిరిజన ప్రాంతాలలో అయితే వినే నాథుడే లేడు. దీనితో అసంతృప్తి, ఆందోళనలు చాలాచోట్ల వచ్చాయి. 2003లో మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుల వల్ల నష్టపోయిన వారికి పునరావాసం కల్పించే పాలసీని (NIRR-2003) ను విడుదల చేశారు. దాని తరహాలోనే 2005లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పునరావాస పాలసీని విడుదల చేసింది. తరువాత 2013లో కేంద్ర చట్టం వచ్చింది (భూసేకరణ, పునరావాసంలో పారదర్శకత, న్యాయమైన పరిహారం హక్కు చట్టం, 2013).

2011లో వచ్చిన ఆంధ్రప్రదేశ్ పీసా రూల్సులో కూడా కొన్ని మార్గదర్శక సూత్రాలు చెప్పారు. ఇవన్నీ ఒక దగ్గర పెట్టుకుని చదివితే షెడ్యూలు ప్రాంతంలోని గిరిజనుల భూమికి చాలా రక్షణలు వున్నాయనిపిస్తుంది. అసలు ముట్టుకోవడం కష్టం అనిపిస్తుంది. వాస్తవాలు వేరేగా వున్నాయి.

**పోలవరం ముంపు (ఐదవ షెడ్యూలు) ప్రాంతాలలో అమలులో వున్న చట్టాలు / రక్షణలు ఇవి**

(i) భూసేకరణ, పునరావాస చట్టం, 2013 (కేంద్ర చట్టం), దానికి సవరణకై ఇచ్చిన ఆర్డినెన్సులు.

(ii) అటవీ హక్కుల చట్టం, 2006 – కేంద్ర చట్టం.

(iii) పీసా చట్టం – ఆంధ్రప్రదేశ్, 1998, రూల్సు 2011

(iv) రాజ్యాంగం 5వ షెడ్యూలు

(v) రాజ్యాంగ వ్యవస్థలు

భూసేకరణ పునరావాసం చట్టం, 2013తో మొదలుపెట్టి మిగతా చట్టాలలోని అంశాలతో అనుసంధానిస్తూ సమస్యను అర్థం చేసుకుంటే పూర్తి అవగాహన ఉంటుంది. ఇంతకుముందు పునరావాసం కల్పించిన సందర్భాలలో ఎదురైన సమస్యలను కూడా జ్ఞాపకం చేసుకుంటే అటువంటి తప్పులు పునరావృత్తం కాకుండా చేసుకోవచ్చు.

**భూసేకరణ, పునరావాసం చట్టం, 2013**

నా ఉద్దేశంలో పోలవరం ప్రాజెక్టు యీ చట్ట పరిధిలోకే రావాలి. రాకపోతే తీసుకురావాలి. దీనికి మూడు కారణాలు. (1) ముంపు గ్రామాలు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒడిసా రాష్ట్రాలలో ఉన్నాయి. అందుకని ఇది అంతర రాష్ట్ర ప్రాజెక్టు (2) ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలి.

అందుకని కేంద్ర చట్టం పరిధిలోకి వస్తుంది. (3) కేంద్ర చట్టం దేశం మొత్తానికి వర్తిస్తుంది. రాష్ట్రంలో 2005లో జి.ఓ. ద్వారా ఇచ్చినది పాలసీయే. చట్టం కాదు.

**ముఖ్యాంశాలు**

ఈ చట్టం పూర్తి పేరు భూసేకరణ, పునరావాసంలో పారదర్శకత న్యాయమైన పరిహారం హక్కు చట్టం, 2013 – (The Right to fair Compansation And Transparency in lend aquisition, rehabilitation and resettlement Act. 2013) ఈ చట్టం ముఖ్య ఉద్దేశం ప్రకారం నష్టపరిహారం సరైన అంచనా వెయ్యాలి. అదే కాకుండా భూసేకరణ, పునరావాస కార్యక్రమాలలో పారదర్శకత ఉండాలి. ప్రజలకు విషయాలన్నీ తెలియజేసి, గ్రామ సభల, మండళ్ళ ఆమోదం పొందాలి. ప్రజలను అడుగడుగునా భాగస్వాములుగా చెయ్యాలి. దీనికోసం రాజ్యాంగ బద్ధమైన గ్రామసభ, ఇతర స్థానిక వ్యవస్థలతో సంప్రదింపులు – అదీ కూడా భాగస్వామ్యం, గోప్యతలేని సంప్రదింపులు జరిపే విధంగా ఉండాలని చట్టం నాందిలోనే పేర్కొనబడింది. అయితే నాందిలోనే ఇది ఆగిపోయింది అని చాలామంది అభ్యుదయవాదులు వాదిస్తారు. ఈ చట్టానికి ఇచ్చిన సవరణ ఆర్డినెన్స్ ప్రకారం సంప్రదింపులు అనేవి లేకుండా చేయడం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధం అని కూడా వాదించారు చాలామంది. గోప్యత లేదు అంటారే కాని పైకి చెప్పని ఎజెండా ఎప్పుడూ ఉంటుందని చాలామంది అనుమానం. అసలు సవరణ ఆర్డినెన్స్ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు (ఎన్నికల తరువాత) ఏర్పడకముందే ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. మరొక ముఖ్యమైన అంశం ఏమంటే ప్రాజెక్టు వల్ల సమాజంపై ప్రభావంను అంచనా వెయ్యాలి. ఈ అంచనా ప్రజల భాగస్వామ్యంతో చెయ్యాలి. గ్రామసభ, పంచాయతీకి సంబంధించిన ప్రతినిధుల ప్రాతినిధ్యం ఉండాలి. సమాజంపై ప్రభావం అంచనా చేసిన రిపోర్టును ప్రజలతో పంచుకోవాలి. ఈ అంచనాలలో ముఖ్యాంశాలు.

(i) అసలు ఈ భూసేకరణ వల్ల ప్రజాప్రయోజనం చేకూరుతుందా? లేదా? అనే విషయం పరిశీలించాలి. అసలు చిక్కు ఇక్కడే ఉంది. ప్రజలు అంటే ఏ ప్రజలు. మునిగిపోయే ప్రజలా. ఆయకట్టు ప్రజలా? అనే ప్రశ్న చాలా అంచనాలలో కనిపించదు. ఆయకట్టుదార్లపై ఉన్న ప్రేమ, మునిగిపోయే ప్రజల మీద (అది కూడా గిరిజనులు అయితే) కనిపించదు. ఈ ప్రాజెక్టులో అయితే ప్రజాభిప్రాయ సేకరణ తూ, తూ మంత్రంగా చేసేరనియు, అది కూడా పోలీసుల పహారాలో ముంపు ప్రాంతాలకు దూరంగా చేసేరని ఆరోపణలు ఉన్నాయి. అదే కాకుండా యీ చట్టం రాకముందు చేసిన ముంపు ప్రభావం యొక్క అంచనా ఇప్పుడు చెల్లుతుందా, లేదా? అనేది మరొక సందేహం. ఎందుకంటే ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు – జాతీయ చట్టంలో సామాజిక ప్రభావం జరిపే పద్ధతులను వివరంగా తెలిపారు. ఇంతకంటే

ముఖ్యమైనది. అసలు ముంపులేనిది, ముంపు తక్కువగా ఉండే ప్రాజెక్టు నమూనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవి పరిశీలించడానికి కూడా అంగీకరించే రాజకీయ పరిస్థితి కనుపడుట లేదు. సవరణ ఆర్డినెన్సు ప్రకారం అసలు సామాజిక ప్రభావం అంచనా అవసరం లేదనే భావన ప్రస్ఫుటమవుతోంది. "ప్రజలు ఏమైనా కాని మనం చేద్దామనుకున్న పని మనం పనిచేయాలి" అనే నియంతృత్వ పోకడలు ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తాయి. పంతం పట్టినట్లు మూడోసారి ఆర్డినెన్సును జారీ చేయడంలో అంతరార్థం ఇదే అనిపిస్తోంది. ఇది ఇంకా పార్లమెంట్ ఆమోదం కోసం ఆగింది. కాబట్టి సామాజిక ప్రభావం అంచనాలతో చూడవలసిన అంశాలను పరిశీలిద్దాం.

(ii) ప్రాజెక్టు వల్ల ప్రభావితుల అవబోతున్న కుటుంబాలు, అందులో నిర్వాసితులు అవుతున్న కుటుంబాల అంచనా వెయ్యాలి.

(iii) ప్రభుత్వ, ప్రైవేట్ భూములు, ఇండ్లు, ఆవాసాలు ఇతర సామాజిక ఆస్తులు లాంటి వాటిపై ప్రభావం అంచనా వెయ్యాలి.

(iv) ప్రాజెక్టుకు కావలసిన కనిష్ఠ భూమి కూడా అంచనా వెయ్యాలి.

(v) వేరే జాగాలో భూసేకరణ చేస్తే ఈ ప్రాజెక్టు కోసం సరిపోతుందా? లేదా? అనేది కూడా చూడాలి.

(vi) సామాజిక దుష్ప్రభావాన్ని తగ్గించేందుకు అయ్యే ఖర్చులు ప్రాజెక్టు ఖర్చులలో ఉంచడంతో పాటు, దానివల్ల ప్రజలకొచ్చే లాభాలు కూడా తెలుసుకోవాలి.

(vii) అంచనాలో భాగంగా ప్రజల జీవనాధారాలపై ప్రాజెక్టు ప్రభావం, ప్రభుత్వ, సామాజిక ఆస్తులు, రోడ్లు, రవాణా వ్యవస్థ, మురుగు నీటి వ్యవస్థ, త్రాగేనీరు – ప్రజలకు, పశువులకు, పారిశుధ్యం, చెరువులు, పశువులను మేపే భూములు, చెట్లు, పోస్టాఫీసు, నిత్యావసర వస్తువుల దుకాణాలు, గోదాములు, కరెంట్ సౌకర్యం, వైద్య సౌకర్యం, విద్యాలయాలు, స్మశానాలు, ప్రార్థనా స్థలాలు, పార్కులు లాంటివన్నీ క్రోడీకరించాలి.

(viii) సామాజిక దుష్ప్రభావాన్ని తగ్గించే ప్రణాళిక కూడా తయారు చేయాలి.

(xi) సామాజిక ప్రభావం అంచనా వేసే ముందు ప్రజాభిప్రాయ సేకరణకు ఒక తేదీ, సమయం, ప్రదేశం నిర్ణయించాలి. అది ప్రభావిత ప్రజలందరికీ విస్తృత ప్రచారం ద్వారా తెలియచెయ్యాలి. అక్కడే ప్రభావిత ప్రజల అభిప్రాయాలు సేకరించి నమోదు చెయ్యాలి.

(x) సామాజిక ప్రభావంపై తయారుచేసిన రిపోర్టును స్థానిక భాషలోకి అనువదించి పంచాయతీ నుండి జిల్లా కలెక్టర్ ఆఫీసు వరకూ అన్ని చోట్లా అందుబాటులో ఉండేలా చేయాలి.

వెబ్‌సైట్‌లో కూడా ఉంచాలి.

(xi) ఈ రిపోర్టును ప్రభుత్వం నియమించిన నిపుణుల గ్రూపు పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. ఈ సిఫార్సులో ముఖ్యమైనది : ఈ ప్రాజెక్టు వల్ల ప్రజా ప్రయోజనం సమకూరుతుందా? లేదా? సమాజంపై దుష్ఫలితాల కంటే సత్ఫలితాలు ఎక్కువగా ఉన్నాయా? దీన్ని బట్టి ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావాలి. ఇవన్నీ ఆదరాబాదరాగా చేసేరని ఆరోపణలు చాలా వున్నాయి. మరొక విచిత్రమైన విషయం ఉంది.

ఈ ప్రాజెక్టులోనే కాదు. ఇతర ప్రాజెక్టులలో కూడా జరుగుతుంది. అంచనాలు తయారు చేసే ప్రక్రియలు విచిత్రంగా ఉంటాయి. మొదటి అంచనాలలో ఖర్చులు తక్కువ, లాభాలు ఎక్కువ చూపిస్తారు (ఖర్చు – లాభం నిష్పత్తి). ప్రాజెక్టు మంజూరు అయిన తర్వాత ప్రతి సంవత్సరం ఖర్చుల అంచనాలు పెరుగుతాయి. చివరకు ప్రకటించిన ఆయకట్టు ఊహాజనిత ఆయకట్టుగానే మిగులుతుంది. ప్రయోజనం పొందిన ఆయకట్టు తక్కువగా ఉంటుంది. ఆయకట్టు అభివృద్ధిపై శ్రద్ధ ఉండదు. ఎందుకంటే ఆనకట్టు పనిలో వచ్చే లాభాలు ఆయకట్టు అభివృద్ధిలో రావు. ఆనకట్టు కాంట్రాక్టర్లది, ఆయకట్టు ప్రజలది. నిర్వాసితుల్ని గాలికి వదిలేస్తారు. ఇది సమాకాలీన చరిత్ర.

**ప్రభావిత కుటుంబం ఎవరు?**

ప్రభావిత కుటుంబం అంటే (i) కుటుంబానికి సంబంధించిన భూమి కాని, స్థిరాస్తి కాని సేకరించబడిన వారు, (ii) ఏ విధమైన భూమి లేకపోయినా వ్యవసాయ కూలీలుగా జీవించేవారు, కౌలుదారులు, అనుభవహక్కుదారుడు, వృత్తి కళాకారులు, (iii) షెడ్యూలు తెగలు, సాంప్రదాయక అటవీ నివాసులై వుండి వారి హక్కులకు ఇంకా గుర్తింపుకు రానివారు, (iv) భూసేకరణ సమయానికి మూడు సంవత్సరాల ముందు నుంచి చిన్న తరహా అటవీ ఫలసాయ సేకరణ పైనా, చేపలు పట్టుకుని జీవించే వారు (v) ప్రభుత్వ భూమి పంపకంలోని లబ్దిదారులు.

వ్యవసాయ కుటుంబం అంటే వ్యవసాయం, పండ్ల తోటలు, పాడి పరిశ్రమ, కోళ్ళఫారం, చేపల చెరువులు, పట్టు పరిశ్రమ, నారు మొక్కల పెంపకం, పశుగ్రాసానికి ఉపయోగించే భూములన్నీ యీ కోవకి చెందినవే.

**సేకరణ ఖర్చు అంటే ఏమిటి?**

నిర్ణయించిన పరిహారం, భూమికి, పంటకు వచ్చిన నష్టం, భూమి, బిల్డింగుల విలువ, పునరావాస కేంద్రాలలో నిర్మించే సౌకర్యాలకై ఖర్చు, పునరావాస పథకాలకు ఖర్చు, నిర్వహణ ఖర్చులు. భూమి, పంటలకు కలిగే నష్టం, పునరావాస కేంద్రాలలో కల్పించే మౌలిక

సదుపాయాలు, పునరావాసం, ఖర్చులు.

**నిర్వాసిత కుటుంబం అంటే ఏమిటి?**

భూసేకరణ వల్ల నివాస ప్రదేశం నుండి వేరే చోట పునరావాసం కల్పించవలసిన కుటుంబం.

కుటుంబం అంటే ఒక మనిషి, భార్య / భర్త, చిన్న పిల్లలు, ఆధారపడిన తమ్ముళ్ళు, చెల్లెళ్ళు (చాలా చిన్నవారు)? అయితే విధవలు, విడాకులు తీసుకున్నవారు, భర్త వదిలివేసిన స్త్రీలు, పెండ్లికాని వారు, తోడులేని పెద్దలు వేరే కుటుంబంగా తీసుకొనబడతారు.

**భూస్వామి అంటే ఎవరు?**

(1) ప్రభుత్వ అధికారిక రికార్డుల్లో భూమి, బిల్డింగు నమోదు అయినవారు (2) అటవీ హక్కుల చట్టం క్రింద హక్కులు పొందినవారు (3) భూమి ఉండి పట్టా హక్కుకు అర్హత ఉన్నవారు ఈ తరగతికి వస్తారు. అయితే చిన్న తరహా అటవీ ఫల సేకరణదారులు ఇందులోకి రారు. అటవీ హక్కుల చట్టం క్రింద అటవీ భూమి సామాజిక ఆస్తి అయినా, సమాజం గుర్తించిన సేకరణ హక్కు వున్నా వీరిని ఈ తరగతిలో చేర్చకపోవడం తప్పే.

**మార్కెట్ ధర అంటే నష్టమే**

ఆహార భద్రత దృష్ట్యా పలు పంటలు పండే భూములను సేకరించడం తప్పని పరిస్థితుల్లో ఆఖరి చర్యగా చేపట్టాలి. పోలవరం ముంపు ప్రాంతాలలో ముఖ్యంగా ఒడ్డుకు ఇరువైపులా వున్న గ్రామాల్లో జీవనాధారం వ్యవసాయమే. వరదల్లో కొట్టుకువచ్చిన భూసారంతో పంటల ఉత్పత్తి పెరుగుతుంది. సస్యశ్యామలమైన పలు పంటలు పండే పొలాలు సేకరణ చట్ట వ్యతిరేకం. ఎందుకంటే అంత తప్పని పరిస్థితులు లేవని నిపుణులు చెబుతూనే ఉన్నారు. ముంపు లేకుండా / తగ్గించే ప్రత్యామ్నాయాలు చూపించారు కూడా. ఇక మార్కెట్ ధర విషయానికి వద్దాం.

అసలు వ్యవసాయదారునికి భూమి జీవనాధారం. వెలకట్టలేనిది. భూసారం, వర్షాలు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు (ముఖ్యంగా కరెంట్), రుణ సౌకర్యం లాంటివి సక్రమంగా వుంటే గాదె నిండుతుంది. గాదె నిండా ధాన్యం, కడుపు నిండా భోజనం, పై ఖర్చులకు ఆదాయంతో కంటినిండా నిద్ర. అందుకే భూమాత అంటారు. ఇదే స్వర్గం సామాన్య రైతుకు. భూమి అమ్మకం, తాకట్టు పెట్టడం అనేది భరించరాని క్షోభను మిగిలిస్తుంది రైతుకు.

ముంపుకు లోనయ్యే షెడ్యూలు ప్రాంతాలలో అయితే భూమి బదలాయింపు నిషేధం 1917 నుంచి ఉందని ఇంతకుముందే తెలియజేశా. ఏదైనా బదలాయింపులు ఉంటే అవి

చట్ట విరుద్ధంగా జరిగినవే. గిరిజన – గిరిజనేతరుల మధ్య, గిరిజనేతర వ్యక్తుల మధ్య భూబదలాయింపు కూడా (1/70) నిషిద్ధం. రిజిస్ట్రేషన్ కూడా నిషిద్ధం. గిరిజనుల మధ్య నిషేధం లేకపోయినా ఇరువురు బీదవారే. అటువంటి సమయాలలో భూమికి 'జీవనాధార విలువ' ఉంటుంది కాని అమ్ముకునే 'ఖరీదు' అండదు. అందుకనే ఖరీదులు కట్టకుండా భూమికి భూమి ఇవ్వాలని కోరుకుంటారు. అది కూడా వ్యవసాయపరంగా 'అంతే యోగ్యత' కలిగిన భూమిని నష్టపరిహారం క్రింద ఇవ్వాలి అని కోరుకుంటారు.

రిజిస్ట్రేషన్లు లేని చోట్ల ధర నిర్ణయించడం వల్ల ఈ వ్యవహారం అధికారుల చిత్తానికి వదిలివేయబడుతుంది. అప్పుడు ఎన్ని రెట్లు ఇస్తే ఏమి లాభం. అసలు ధన రూపేణా ఇచ్చే పరిహారంలో మరో చిక్కు వుంది. అంతకుముందు అప్పులు ఇచ్చిన షావుకారు / భూస్వామి నీడలా వెంటాడి మొదట లాభపడతాడు. తరువాత బ్యాంకుకు దగ్గరగా ఉండే సారా దుకాణదారుడు రెండో లబ్దిదారు. ఇంటికి వెళ్ళేసరికి ఖాళీ జేబుతో వెళ్ళి కుటుంబ సభ్యులను క్షోభకు గురిచేసిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఎందుకంటే గిరిజనుల్లో వ్యాపార దృష్టి లేదు. 'ఏ రోజు కారోజు' (సబ్‌సిస్టెన్స్ ఎకానమీ) అనే ఆర్థిక వ్యవస్థ వారిది. తినేందుకు కావలసిన పంటలు పండించే వ్యవస్థ చాలాకాలం క్రితం వరకూ ఉండేది. ఈ మధ్యనే వాణిజ్య పంటలు వచ్చాయి. గిరిజన సంస్కృతి (ఆర్థిక, సామాజిక)ని అర్థం చేసుకోకుండా, అధికారులు వ్యాపార దృక్పథంతో నిర్ణయించే ఈ పద్ధతి వల్ల నష్టాలే ఎక్కువ. మరొక ముఖ్య విషయం ఉంది.

**భూమికి భూమి ఎందుకు ఇవ్వకూడదు?**

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (విస్తరణ) చట్టం, 1998కు సంబంధించి జారీ చేసిన రూల్సు ప్రకారం (జి.ఓ. 66) ప్రాజెక్టు బాధిత గిరిజన కుటుంబానికి ఆయకట్టు ప్రాంతంలో భూ కేటాయింపు విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి అని ఉంది. అయితే ప్రాధాన్యత ఇవ్వాలి అనే కంటే తప్పకుండా ఇవ్వాలి అని ఉంటే బాగుండేది. ఎందుకంటే ఇది రాజ్యాంగ బాధ్యత. షెడ్యూలు ప్రాంతాలలో నివసించే గిరిజనులను అన్ని రకాల దోపిడీ నుంచి కాపాడే బాధ్యత ప్రభుత్వానిది. ఇక్కడ ప్రభుత్వమే ప్రాజెక్టు పేరుతో భూసేకరణ చేస్తున్నప్పుడు భూమికి భూమి తప్పకుండా ఇవ్వాలి. మరొక విషయం. ప్రాజెక్టు కట్టిన తరువాత రెండు పరిణామాలు ఉంటాయి. మొదటిది ముంపు ఎప్పటికీ ఉంటుంది. అందుకని అక్కడి నుండి ప్రజలు తరలి వెళ్ళక తప్పదు. రెండవది ఆయకట్టు ప్రాంతంలో స్థిరమైన ఆయకట్టు వస్తుంది. అంటే అప్పటి వరకు ఒక పంట పండుతున్న భూమిలో మూడు పంటలు పండుతాయి. అప్పుడు చాలామంది రైతులు సీలింగ్ లిమిట్‌లోకి వస్తారు. అలా కాకుండా ఇప్పటికే చిన్న కమతాలుగా మార్చుకున్నా వారికి వచ్చే మూడు రెట్లు సౌభాగ్యము గిరిజనులు భూములు ముంచడం వల్లనే కదా వస్తోంది.

**ప్రజల పరంగా ఆలోచిస్తే ముంపు ప్రాంతంలో చేపట్టిన బలవంతపు సేకరణ ఆయకట్టులో ఎందుకు చేపట్టకూడదు?** పునరావాసం కూడా ప్రజా ప్రయోజనమే కదా! అప్పుడు ఇబ్బంది లేకుండా పునరావాసం కల్పించవచ్చును. కాని చాలామందికి ఆయకట్టుదార్ల మీదే ప్రేమ ఎక్కువ. అందుకని ఈ ఆలోచనను సమర్ధించరు.

**భూసేకరణ, పునరావాసంపై పేర్కొన్న నిబంధనలు**

**భూసేకరణ, పునరావాస చట్టం, 2013 (41(1)) ప్రకారం వీలైనంతవరకు షెడ్యూలు ప్రాంతాలలో భూసేకరణ చేపట్టకూడదు. భూసేకరణ చేయవలసి వస్తే అది తప్పనిసరి పరిస్థితుల్లో చేస్తున్నట్లు అందరికి అర్థం అయ్యేలా చెయ్యాలి.** ఇటువంటి నిబంధన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (విస్తరణ) చట్టం-1998 (పీసా) లో లేదు. భూసేకరణ చేసే ముందరే గ్రామ సభ కాని, వివిధ స్థాయిల్లోని పంచాయతీల ఆమోదం పొందాలి. ఆంధ్రప్రదేశ్ (పీసా) చట్టంలోనైతే (242 ఎఫ్) మండల పరిషత్‌ను సంప్రదించవలెను అని వుంది. పలు సందర్భాలలో కోర్టులు చెప్పిన ప్రకారం 'సంప్రదింపులు' అంటే 'ఆమోదము' అని వ్యాఖ్యానించారు. అంటే గ్రామసభ / పంచాయతీ / మండలం ఆమోదం పొందాలి. అయితే పోలవరం విషయంలో 2005లోనే గ్రామ సభల ఆమోదం పొందినట్లు కొందరు అధికారులు చెబుతారు. నిజంగా ఇటువంటి ఆమోదం పొందినా అది చెల్లదని నా అభిప్రాయం. కొన్ని గ్రామసభలు తమ ఆమోదం తెలుపలేదని గిరిజన ప్రతినిధులు చాలామంది పత్రికాముఖంగా ప్రకటనలు చేయటం మనం చూసేం. రెండవది ముఖ్యమైనది పీసా చట్టం. అమలుకు కావలసిన విధి విధానాలు 2011లోనే వచ్చాయి. వాటి ప్రకారం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు రాష్ట్ర గిరిజన సంక్షేమ కమిషనర్‌కు పంపాలి. వారు పరిశీలించి పీసా గ్రామసభలను ఏర్పాటు చేయాలి. అందుకని 2011 తరువాతే అధికారికంగా పీసా గ్రామసభలు వచ్చాయి. అటువంటప్పుడు 2005లో తీసుకున్నట్టు చెప్పబడుతున్న ఆమోదాలు ఎలా చెల్లుబాటు అవుతాయి.

భూసేకరణ పునరావాస చట్టం, 2013 ప్రకారం, ప్రాజెక్ట్ ప్రభావిత ప్రజల పునరావాసంకై 'అభివృద్ధి ప్రణాళిక' తయారుచెయ్యాలి. ముఖ్యంగా భూమికి సంబంధించిన హక్కులను నిర్ధారించే విషయాలు పేర్కొనాలి. అన్యాక్రాంతమైన వ్యవసాయ భూమి గిరిజనులకు తిరిగి ఇప్పించే చర్యలు, అటవీ హక్కులు పరిష్కారం కాకపోవడం, చాలా భూములకు పట్టాలు లేకపోవడం గురించి ఇప్పటికే విస్తృతంగా చర్చించేం. ప్రభావిత ప్రాంతాలలో యీ దిశలో ఏ చర్యలు చేపట్ట లేదనేది చాలామంది గిరిజనుల ఆవేదన.

అభివృద్ధి ప్రణాళిక ప్రభావిత గిరిజనులతో సంప్రదించాలని నిబంధనల్లో

పేర్కొనబడింది. అంటే ప్రభావిత ప్రజలకు (నిర్వాసితులు) ఎక్కడ పునరావాసం కల్పిస్తారు అనేది దీనిలో ముఖ్యమైన భాగం. ఇక్కడ గిరిజన సంస్కృతిలోని మరో ముఖ్యమైన విషయం తెలుసుకోవాలి. గిరిజన గ్రామాలలో నీటి ఎద్దడి, చిన్న తరహా అటవీ సంపద తగ్గిపోవడం, అనారోగ్యాలు, అకాల మరణాలు, క్రూరమృగాల దాడి, గ్రామ పెద్దల మధ్య తగవులు లాంటి సందర్భాలలో గిరిజనులు మరో ప్రాంతానికి వెళ్ళి అక్కడ 'కొత్త గూడా'లు నిర్మించుకోవడం అనేది సమకాలీన గిరిజన చరిత్రలో చాలా చోట్ల చూస్తున్నాం. అయితే కొత్త ప్రదేశానికి వెళ్ళే ముందు చాలా ప్రక్రియ ఉంటుంది. ఆ ప్రదేశంలో సమాజంలో అందరూ సుఖంగా జీవించేందుకు కావలసిన వనరులు వున్నాయో లేదో మొదట చూసుకుంటారు. తరువాత కొంతమంది అక్కడ నిద్రపోతారు. మంచి శకునాలు కనిపించడం లేక చెడు శకునాలు రాకపోవటం ముఖ్యం. వారి గ్రామ పోలిమేర దేవతలను పునఃప్రతిష్ట చేయడం లాంటివి చేసిన తరువాతే కొత్త ప్రదేశానికి వెళతారు. కొన్ని నెలల క్రితం భద్రాచలంలో ముంపు గ్రామాల ప్రతినిధుల సమావేశం జరిగింది. దాంట్లో వక్తలు పేర్కొన్న ప్రకారం ముంపు గ్రామాల ప్రజలు ఎక్కడకు వెళ్ళాలి అనే విషయంలో ఇప్పటికీ వారితో సంప్రదింపులు జరపలేదు అని అందరూ నాకు తెలిపారు .

భూసేకరణ, పునరావాసం చట్టం 2013 ప్రకారం షెడ్యూలు తెగలకు షెడ్యూలు ప్రాంతాలలోనే పునరావాసం కల్పించాలి. ఇదే విషయం పీసా చట్టం కూడా చెబుతోంది. ఇది కూడా ఒకే జాగాలో చేయాలి. ఎందుకంటే వారి జాతి, భాష, సాంస్కృతిక గుర్తింపులను కాపాడుకునేందుకు ఇది వీలు పడుతుంది. అదేకాకుండా సామాజిక అవసరాలకు కూడా భూమిని ఉచితంగా ప్రభుత్వం సమకూర్చాలి. సమాజాల్ని సమాజాలుగా పునరావాసం చేపట్టాలి.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (విస్తరణ) చట్టం (పీసా చట్టం), 1998లో అను సూచిత ప్రాంతాలలో భూసేకరణకు నిబంధనలు యీ విధంగా పేర్కొన్నారు.

**అనుసూచిత ప్రాంతాలలో భూసేకరణ**

(1) ఏదేని చట్టం క్రింద భూసేకరణకు ప్రభుత్వం ప్రతిపాదించినట్లయితే, ప్రతిపాదనలతో పాటు ఈ క్రింది తెలియజేసిన సమాచారాన్ని మండల ప్రజా పరిషత్‌కు ప్రభుత్వం లేదా సంబంధిత అధికార వర్గం సమర్పిస్తుంది.

(i) ప్రాజెక్టు సంభావ ప్రభావంతో పాటు ప్రతిపాదిత ప్రాజెక్టు పూర్తి వివరాలు.

(ii) ప్రతిపాదిత భూసేకరణ.

(iii) గ్రామంలో కొత్తగా స్థిరపడే ప్రజలు, ఆ ప్రాంతం, సమాజంలో సంభావిత

ప్రభావం.

(iv) గ్రామ ప్రజలకు ప్రతిపాదిత భాగస్వామ్యం, నష్టపరిహార మొత్తం, ఉద్యోగాల అవకాశాలు.

(2) పూర్తి సమాచారం అందిన పిదప, సంబంధిత మండల ప్రజా పరిషత్, సంబంధిత అధికారుల ప్రతినిధులను, ప్రభుత్వాన్ని వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఈ ప్రతిపాదనలను పరిశీలించడం కోసం పిలవడానికి అధికారం కలిగి వుంటుంది. ఆ విధంగా పిలవబడిన వ్యక్తులందరూ అంశాల వారీగా స్పష్టమైన, ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వవలసి ఉంటుంది.

(3) మండల ప్రజా పరిషత్ అన్ని వాస్తవాలను పరిశీలించిన పిదప ప్రతిపాదిత భూసేకరణ, భూములను కోల్పోయే వ్యక్తులకు పునరావాస ప్రణాళిక వంటి విషయాల గురించి సిఫారసు చేయాలి.

(4) భూసేకరణాధికారి మండల ప్రజా పరిషత్ సిఫారసును పరిశీలించాలి.

(5) మండల ప్రజా పరిషత్ సిఫారసులతో భూసేకరణ అధికారి అంగీకరించని సందర్భంలో పరిశీలన కోసం ఆ కేసును తిరిగి మండల ప్రజా పరిషత్‌కు పంపుతారు.

(6) రెండవసారి పరిశీలించిన పిదప కూడా భూసేకరణ అధికారి మండల ప్రజా పరిషత్ సిఫారసులకు వ్యతిరేకంగా ఒక ఉత్తర్వును జారీ చేసినట్లయితే, రాతపూర్వకంగా అందుకు గల కారణాలను ఆయన రికార్డు చేయాలి.

(7) పారిశ్రామిక ప్రాజెక్టులను నెలకొల్పే సందర్భంలో అట్టి ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే అన్ని మండల ప్రజాపరిషత్‌లను సంప్రదించాలి.

(8) భూసేకరణ ప్రకటన తేదీ నుండి ప్రతి మూడు నెలల తరువాత పునరావాస ప్రణాళిక ప్రగతిని మండల ప్రజాపరిషత్ సమక్షంలో ఉంచాలి.

(9) మండల ప్రజా పరిషత్ దృష్టిలో సూచించిన చర్యలను తీసుకోవడం లేదని భావించినట్లయితే, మండల ప్రజా పరిషత్ ఈ విషయమై రాతపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరచాలి. రాష్ట్ర ప్రభుత్వం సముచిత చర్య తీసుకోవలసి వుంటుంది.

(10) ఆర్.ఆర్. ప్యాకేజీలో ఈ క్రింద తెలియజేసిన అంశాలు తప్పనిసరిగా ఉండాలి.

(ఎ) ఎస్.టి. కేటగిరీకి చెందిన ప్రాజెక్టు బాధిత ప్రతి కుటుంబానికి, ఆయకట్టులో భూకేటాయింపు విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలి.

(బి) సాంప్రదాయ హక్కులు / అటవీ ఉత్పత్తుల వినియోగం వంటి నష్టాలకు 500 రోజుల కనీస వ్యవసాయ వేతనాలకు సమానమైన అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రాజెక్టు

బాధిత ప్రతి గిరిజన కుటుంబానికి అందించాలి.

(సి) ప్రాజెక్టు బాధిత గిరిజన కుటుంబాల వారు కోరుకున్న సహజ, నైవాసిక ప్రాంతానికి సమీపంగా పునరావాసం కల్పించాలి. సాధ్యమైనంత వరకు ఒక సంఘటిత బ్లాకులో వారికి పునరావాసం కల్పించాలి. దీనివల్ల వారి నైతిక, భాషాపరమైన, సాంప్రదాయ గుర్తింపులను కొనసాగించడానికి వీలుంటుంది.

(డి) నది / కుంట / డ్యామ్‌లో చేపలు పట్టే హక్కు గల ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు రిజర్వాయరు ప్రాంతంలో చేపలు పట్టే హక్కును కల్పించాలి.

(ఇ) ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతంలోని గిరిజన కుటుంబాలను షెడ్యూల్డు ఏరియాలో పునరావాసం కల్పించాలి.

భూసేకరణ పునరావాసం చట్టం 2013, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (విస్తరణ) చట్టం, 1998లోని పైన పేర్కొన్న అంశాలన్నీ పరిశీలించిన తరువాత మనకు అర్థం అయ్యేది ఏమంటే ఈ ప్రక్రియ అంతా ఇప్పుడు ప్రారంభం అవ్వాలి. లేకపోతే న్యాయస్థానాలలో కేసులు అధికం అవుతాయి. గిరిజనుల్లో అసంతృప్తి పెరిగి ఆందోళనలు చేపట్టే అవకాశం కూడా వుంది. అయితే ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టు క్రింద జరిగిన పునరావాస కార్యక్రమం ఎలా ఉందో పరిశీలిద్దాం.

**ఇంతవరకూ పునరావాసం ఏం జరిగింది?**

**(1) మానవ హక్కుల కమిటీ పరిశీలన**

హైదరాబాద్‌లోని మానవ హక్కుల కమిటీ తరఫున, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి శ్రీ ఎ. గోపాలరావు గారి నాయకత్వంలో ఒక కమిటీ పోలవరం ప్రాజెక్టు క్రింద ఇప్పటికిప్పుడే ముంపుకు గురయ్యే ఏడు గ్రామాల పరిస్థితి తెలుసుకునేందుకు ఆ ప్రాంతాలలో జనవరి 5-6, 2015న పర్యటించింది. మార్చి 3, 2015న ప్రభుత్వానికి వారి రిపోర్టును సమర్పించడం జరిగింది. ఈ కమిటీలో శ్రీ ఎన్. రాజేశ్వరరావు - న్యాయవాది, ఎ. సత్యసాయిబాబా - న్యాయవాది, డా॥ శివరామకృష్ణ, శక్తి (స్వచ్ఛంద సేవాసంస్థ), శ్రీ యుగంధర్ - పత్రికా విలేఖరి పాల్గొన్నారు. రిపోర్టు తయారీ సమయంలో నన్ను కూడా సంప్రదించారు. ప్రభుత్వానికి వారు సమర్పించిన రిపోర్టు కాపీని నాకు కూడా పంపించారు. దాంట్లోని వివరాలు క్లుప్తంగా ఇలాగ వున్నాయి.

(i) ఏడు గ్రామాలు అంటే మామిడిగొంది, దేవరాగొంది, రామాయంపేట, తోటగొంది,

సింగనాపల్లి, పైడిపాక, చేగొండపల్లి గ్రామాలు త్వరలోనే ముంపుకు గురి అవుతాయి.

(ii) మొత్తం ప్రాజెక్టులో 47,911 కుటుంబాలు (288 గ్రామాలు) నిర్వాసితులు అవుతారు. సుమారు 1,95,357 జనాభా – దీంట్లో 50 శాతం పైగా గిరిజనులు నిర్వాసితులు అవుతారు.

(iii) నీటి పారుదల శాఖ జి.ఓ. 68 తేదీ 08-04-2005లో చెప్పిన నిబంధనల ప్రకారం పునరావాసం జరిగిందో లేదోనని వీరు పరిశీలించారు. నిబంధనలు బాగా కనిపించినా ఆచరణలో అమలు కాలేదు అని పేర్కొన్నారు.

(iv) పోలవరం తహసీల్దారు తయారుచేసిన రిపోర్టు ప్రకారం నష్ట పరిహారాన్ని బాధితుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసినట్లు ఉంది కాని బాధితులు దానితో సంతృప్తి చెందలేదు.

(v) ప్రభుత్వ పాలసీ ప్రకారం చెట్లు, ఇళ్ళు, భూమికి పరిహారం ఇవ్వాలి. ఇది ఇవ్వకపోవటం చట్టసమ్మతం కాదు. ఈ పరిహారాన్ని ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సరికాదు అని కూడా పేర్కొన్నారు.

(vi) మేజర్లైన కుమార్తె, కుమారుడు వేరే కుటుంబ సభ్యులుగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలి. అది చేయలేదు.

(vii) అటవీ హక్కుల చట్టం క్రింద వ్యక్తిగత, సామాజిక హక్కులు గుర్తింపు అసంపూర్ణంగానే వుంది.

(viii) పునరావాసం కల్పించిన కాలనీలు వారి వారి స్వగ్రామాలకు చాలా దూరంగా వున్నాయి. అదే కాకుండా వారికి ఇచ్చిన భూములు పునరావాస గ్రామానికి 20 కి.మీ.కు పైగా దూరంలో వున్నాయి.

(ix) పునరావాస కేంద్రాలలో స్మశానం, ప్రార్థనా స్థలాలు లాంటి సామాజిక అవసరాలకు ఏ విధమైన ఏర్పాట్లు చేయలేదు.

(x) షెడ్యూలు ప్రాంతం నుంచి నిర్వాసితులైన గిరిజనులు, వారికి షెడ్యూలు ప్రాంతాలలో లభించిన రాజ్యాంగ రక్షణలు, సదుపాయాలు పునరావాస గ్రామాలలో కూడా చట్టప్రకారం లభించాలి. అయితే పీసా, అటవీ హక్కుల చట్టం, భూమి బదలాయింపు చట్టం,

100 శాతం రిజర్వేషన్లు లాంటివి అదే స్థాయిలో లభించాలంటే పునరావాస గ్రామాలను షెడ్యూలు గ్రామాలుగా గుర్తించాలి. అటువంటి ప్రక్రియ ప్రారంభమే కాలేదు.

వెంటనే ముంపుకు గురయ్యే (7) గ్రామాల పరిస్థితి ఇలాగ వుంటే 276 గ్రామాల సంగతి ఏమిటి అని అందరూ చర్చించుకునేదే. మరొక ముఖ్యమైన విషయమేమిటంటే పోలవరం ప్రాజెక్టు నాలుగు సంవత్సరాలలో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ప్రకటనలు చేస్తున్నారు కాని, పునరావాస చర్యలు అప్పటిలోగా పూర్తి అవుతాయని అంతగా గట్టిగా మాట్లాడట్లేదు. అందుకని రాజ్యాంగ, చట్టపరమైన హక్కులు కాపాడుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక ఈ క్రింది విధంగా వుండాలని సలహా.

### సి.పి.ఎం. రాష్ట్ర నాయకత్వం పర్యటన రిపోర్టు

2015 సం॥ జూలై 1, 2, 3 తేదీల్లో సి.పి.ఎం. రాష్ట్ర నాయకత్వం పోలవరం విలీన ప్రాంతాలలోని నెల్లిపాక, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పర్యటించి అనేక మందితో మాట్లాడింది. ప్రజాశక్తి జూలై 10, 2015లో శ్రీ ఎం. కృష్ణమూర్తి, సి.పి.ఎం. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రచురించిన వ్యాసంలోని ముఖ్యమైన విషయాలు ఈ విధంగా వున్నాయి.

(i) భద్రాచలం ఆనుకున్న గ్రామస్తులు – ఐ.టి.డి.ఎ. రంపచోడవరంకు 200 కి.మీ., జిల్లా కలెక్టర్ కాకినాడకు 250 కి.మీ. దూరంలో వున్నారు.

(ii) విలీన ప్రాంతాలలో ఆర్.డి.ఓ. ఆఫీసు, కోర్టు లాంటివి లేవు.

(iii) భద్రాచలంలోని అన్ని విద్యా సంస్థలలో నిన్నటి వరకూ వీరికి సీట్లు లభించేవి. రాత్రికి రాత్రి పరాయివాళ్ళు (నాన్ లోకల్) అయిపోయారు. ఇప్పుడు ఎక్కడకు పోవాలో ఎవరూ నిర్ణయించలేదు.

(iv) తహసీల్దార్ ఆఫీసులో తహసీల్దార్ కాని, గుమస్తాలు కాని లేరు. ఎం.పి.డి.ఓ. ఒకరు ఉంటే ఆయనకు అక్కడ పనిచేసే ఆసక్తి లేదు.

(v) విద్యావంతులైన యువకులకు ఉద్యోగ అవకాశాలు కరువైనాయి. వారు కూడా 'స్థానికత' పేరుతో తిరస్కరించబడుతున్నారు.

(vi) టీచర్లు లేరు, 145 మందికి 14 మందే ఉన్నారు. ఖాళీలను భర్తీ చేయడం లేదు.

(vii) విద్యార్థులు బస్‌పాస్‌కు గోకవరం (150 కి.మీ.) వెళ్ళాలి.

(viii) ఆసుపత్రి లేదు. పి.హెచ్.సి. లేదు. వైద్యులు లేరు.

(ix) ముంపు గ్రామాలలో రోడ్లు, చెరువులు, కల్వర్టులు, త్రాగునీటి వనరులు తుపానుకు పాడవుతే బాగుచేయలేదు. "ఎలాగైనా మునిగిపోయేదే కదా, ఇంకెందుకు రిపేరు" అంటున్నారు.

(x) పునరావాసం ఊసే లేదు. పునరావాస కార్యక్రమం చేపట్టేందుకు ప్రత్యేక వ్యవస్థ లేదు.

**కార్యాచరణ ప్రణాళిక**

ముంపు లేని / తక్కువగా వుండే ప్రత్యామ్నాయాలు గురించి ఇప్పటికైనా ఆలోచించాలి. ముంపు తప్పనప్పుడు :

(i) పోలవరం ప్రాజెక్టు ఇప్పుడు జాతీయ ప్రాజెక్టుగా పరిగణిస్తున్నారు కాబట్టి కేంద్ర భూసేకరణ, పునరావాస చట్టం 2013 పరిధిలోకి తీసుకురావాలి.

(ii) పైన పేర్కొనబడిన చట్టం ప్రకారం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలలో సామాజిక ప్రభావం అంచనా చట్టప్రకారం ఇప్పుడు చేపట్టాలి.

(iii) (పీసా చట్టం) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ (విస్తరణ) చట్టం 1998 అమలుకు 2011లో జారీ చేసిన (జి.ఓ.) నిబంధనలు ప్రకారం భూసేకరణకు గ్రామసభలు, మండలుల ఆమోదం తీసుకోవాలి.

(iv) పునరావాస ప్రణాళికలు, అమలులో గ్రామసభల ఆమోదం తీసుకోవాలి.

(v) పునరావాస ప్రదేశం ముందర గ్రామస్తులకు చూపించి వారి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూడాలి.

(vi) చట్ట ప్రకారం నిర్వాసితులను సమాజాలు గానే పునరావాసం కల్పించాలి.

(vii) పునరావాసం షెడ్యూలు ప్రాంతాలలోనే కల్పించాలి. షెడ్యూలేతర ప్రాంతాలలో పునరావాసం కల్పిస్తే ఆ ప్రాంతాలను / గ్రామాలను షెడ్యూలు ప్రాంతాలు / షెడ్యూలు గ్రామాలుగా ముందుగానే గుర్తించాలి.

(viii) షెడ్యూలు ప్రాంతాల నుండి తరలించిన గిరిజనులకు భూ బదలాయింపు చట్టం,

అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, స్థానిక గిరిజనుల కోటాతో 100% రిజర్వేషన్ లాంటి సౌకర్యాలు కల్పించాలి.

(ix) షెడ్యూలు గ్రామాలలో నివసించే కొంతమంది భూములు ఇప్పటికే అన్యాక్రాంతం అవటం వల్ల అవి వారికే చెందేలాగా కేసులు సత్వరమే పరిష్కరించాలి. అవసరమైతే ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించి కాలపరిమితితో పరిష్కరించే ప్రణాళిక తయారు చెయ్యాలి. గ్రామసభలు తీర్మానాలు తీసుకోవాలి.

(x) షెడ్యూలు ప్రాంతాలలో సరైన కారణాలు చూపకుండా తిరస్కరించిన అటవీ హక్కుల దరఖాస్తులు, హక్కుల నిర్ణయంలో జరిగిన అవకతవకలు, అసలు గ్రామసభలే నిర్వహించిన చోట్ల అటవీ హక్కుల చట్టం, 2006ను అమలు జరిపి వ్యక్తిగత, సామాజిక ఆస్తులు నిర్ణయించాలి.

(xi) పీసా చట్ట ప్రకారం సాంప్రదాయ పద్ధతుల్లో గ్రామ పరిపాలన నిర్వహించాలి కాబట్టి గిరిజన సాంప్రదాయాల్ని క్రోడీకరించి చట్టపరమైన గుర్తింపు ఇవ్వాలి.

(xii) ముంపు గ్రామాలలో మునిగిపోనున్న గిరిజనుల గుళ్ళు, గోపురాలు, గ్రామ దేవతల లాంటివి కొత్త ప్రదేశాలలో గిరిజన సాంప్రదాయం ప్రకారం పునఃప్రతిష్ట చెయ్యాలి.

(xiii) గిరిజనులకు ఇళ్ళు కడుతున్నప్పుడు వారి సాంప్రదాయక పూజలు, వారి నమ్మకాలకు, వారి నమూనాలకు ప్రాధాన్యత కల్పించాలి.

(xiv) గ్రామ అవసరాలైన గుడి, స్మశానం, పంచాయతీ ప్రదేశం లాంటి అవసరాలను గిరిజనుల చేతే క్రోడీకరించి వాటిని కొత్త ప్రదేశంలో నిర్మించాలి.

(xv) కొత్త ప్రదేశంలో స్థిరపడే వరకూ సంపూర్ణ సహకారాలు అందించే అధికారిక వ్యవస్థను రూపొందించాలి. సామాజిక సౌకర్యాలు, ఆహార భద్రత, విద్య, వైద్యం లాంటి సౌకర్యాలు నిరంతరంగా అందేలాగ చూసే బాధ్యత యీ వ్యవస్థకు ఇవ్వాలి.

(xvi) గిరిజన సంప్రదాయాల్ని గౌరవించి, వారిని భాగస్వామ్యం చేసే విధంగా అధికార యంత్రాంగానికి శిక్షణ ఇవ్వాలి. మానవ శాస్త్రజ్ఞుల (Anthropologists)ను నియమించడం గాని, వారి సహకారంతో గాని పునరావాసం కార్యక్రమం రూపొందించడం, అమలుపరచడం, అవసరమైతే మధ్యంతర సవరణలు చేయడం ఉండాలి.

(xvii) ప్రాజెక్టు పూర్తి అయిన తరువాత కనీసం పది సంవత్సరాలు ఈ వ్యవస్థ పనిచేయాలి. పూర్తి పునరావాసం (ప్రజలకు నచ్చే విధంగా అమలు) అయిన తరువాతే ప్రాజెక్టు పూర్తి అయినట్టు అధికారికంగా ప్రకటించాలి.

(xviii) గ్రామానికి గ్రామం, సమాజానికి సమాజం, భూమికి భూమి లాంటివి పూర్తిగా కల్పించిన నాడే పునరావాసం అయినట్లు ప్రకటించాలి.

(xix) సాంప్రదాయక సౌకర్యాలతో పాటు గిరిజనులకు, మారుతున్న సమాజంలో అవకాశాలను అందుకునేలాగ గిరిజన విద్యార్థులను తయారు చెయ్యాలి.

(xx) ప్రాజెక్టు పూర్తి అయ్యేవరకు ప్రాజెక్టు అంచనాలు పెరిగినప్పుడల్లా నష్టపరిహారం అదే నిష్పత్తిలో పెరగాలి.౦

(xxi) ప్రస్తుత వన సంరక్షణ సముతుల్లోని లాభాలను ఆయా పునరావాస గ్రామాలకు పంచి ఇవ్వాలి.

(xxii) ముంపు గ్రామాలను తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని గిరిజన శాసనసభా నియోజక వర్గాలలో కలిపి పునర్వ్యవస్థీకరించాలి.

❀❀❀

వెల రూ. 10/-

**27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట**
**విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202**